# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:14 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

కోరంగ పాలనాసహ
కారము నందించెడి శుభకార్యము కొరకై
భారత మలేషియా లిట
చేరి సమాలోచనలను చేసినవి మొగిన్ !!

(పాలనా పరమైన విషయాల్లో పరస్పర సహకారం అందించు కోవడం కోసం భారత్ మలేషియాలు సమావేశమై చేసిన చర్చలు సఫలం కావడంతో ఇరు దేశాలకూ ఎంతో ప్రయోజనం చేకూరిందని రెండు దేశాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

భర్తల కనుసన్నలోనే
భార్యల రాజకీయం
స్త్రీల సాధికారతకు
చిత్రహింస గాయం.
ఎన్నికల్లో గెలిస్తేనేమి
ఎక్కడైనా స్త్రీస్వామ్యం
ఇంట బయట అణచివేత
ఇంకెక్కడ జనస్వామ్యం.



-వేల్పుల నారాయణ
9440433475

# పల్లెల అభివృద్ధే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం..

## -రూ.173 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం..
## -రెండేళ్లలో మక్తల్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం: మంత్రి సీతక్క, వాకిటి శ్రీహరి



ములుగు ఆగష్టు 20::(నేటినిజం ప్రతినిధి): పట్టణాలకు దీటుగా పల్లె సీమలను అభివృద్ధి చేయడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఒకే రోజు రూ.173 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావించాలన్నారు.

గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని మల్లేపల్లి వద్ద రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను రాష్ట్ర పాడి పరిశ్రమలు, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు సులభమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### మక్తల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు తదితర రంగాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు.

రానున్న రెండేళ్లలో మక్తల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఎవరూ ఊహించని రీతిలో నియోజకవర్గ రూపురేఖలను మారుస్తానని శ్రీహరి స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రతి గ్రామానికి అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామని తెలిపారు.

### లక్ష ఎకరాలకు సాగు, తాగునీరు

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా బీడు భూములను సాగుయోగ్యంగా మార్చి పచ్చని పంట పొలాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా మూడు నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు, తాగునీరు అందించి ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, డీఆర్‌డీవో వెంకట్ రాములు, డీఆర్వో రాజేశ్వరి, తహసీల్దార్ అశోక్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మణెమ్మ, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, సర్పంచులు కథలప్ప, గాండ్ల నికిత ప్రశాంత్, కాశమ్మ, బసవరాజ్, సత్యనారాయణరెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, ఈఈ అశోక్, ఎస్ఈ ఉమేష్, డీఈ కళ్యాణ్‌రెడ్డి, ఏఈ అజయ్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరెం మహేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొక్కు లింగం తదితరులు పాల్గొన్నారు

# వన్ వేపై సర్‌ప్రైజ్ చెక్.. సామాన్యుడిలా బైక్‌పై కేబీఆర్‌కు సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆగస్టు 20: హెచ్-సిటీ (ఊ-అమెఎ) ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల కారణంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఆగస్టు 18 నుంచి వన్- వే ట్రాఫిక్ విధానం అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీపీ సజ్జనార్ వన్ వే ట్రాఫిక్‌పై సర్‌ప్రైజ్ చెక్ నిర్వహించారు. సామాన్యుడిలా బైక్‌పై ప్రయాణిస్తూ ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. రోడ్ నంబర్ 45 నుంచి ఫిల్మ్‌నగర్ వరకు బైక్‌పై రెండు సార్లు తిరుగుతూ ట్రాఫిక్‌ను పరిశీలించారు.

జంక్షన్‌లలో విధుల్లో ఉన్న పోలీసులతో ట్రాఫిక్‌పై సీపీ ఆరా తీశారు. మధ్యాహ్నం కూడా మరోసారి ట్రాఫిక్ సరళిపై పర్యవేక్షించారు. వన్‌వే కారణంగా తొలి రోజు వాహనదారులు కొంత అయోమయానికి గురైనప్పటికీ.. రెండో రోజు నుంచి రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని సజ్జనార్ తెలిపారు. అన్ని జంక్షన్‌లలో స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ, నిర్మాణ సంస్థ సమన్వయంతో ఊ-అమెజ పనులు జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సహకారించాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# మణిపూర్‌లో మళ్లీ నిరసనలు..

## మూడు రోజుల పాటు విద్యాసంస్థలు బంద్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 20: బీజేపీ పాలిత మణిపూర్‌లో మళ్లీ నిరసనలు ఉధృతమయ్యాయి. దీంతో శాంతిభద్రతల పరిస్థితి కారణంగా స్కూల్స్, కాలేజీలు, విద్యా సంస్థలను మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. (ఓజీనితిజూబీతీ ఖతీనీబివబబిబ) మణిపూర్‌లో జనాభా గణనకు ముందే జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)ని నవీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులు (ఐడీపీలు) తమ స్వస్థలాలకు తిరిగి వచ్చేవరకు జనాభా గణన నిర్వహించవద్దని డిమాండ్ చేస్తున్నారు. న్యాయమైన, నిష్పక్షపాత పునర్విభజన ప్రచార సంస్థ (జేఎఫ్‌డీ) వేదికగా దీనిపై పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 48 గంటల సార్వత్రిక సమ్మెకు జేఎఫ్‌డీ పిలుపునిచ్చింది.

కాగా, సమ్మెలో భాగంగా మణిపూర్ లోయ జిల్లాలలోని పలు ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్‌లాంగ్‌లో సీఎం ఖేమ్‌చంద్ సింగ్, హోం మంత్రి గోవిందాస్ కొంతౌజమ్‌ల దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు.

మరోవైపు సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసనలు కొనసాగడంతో గురువారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను బహిష్కరిస్తున్నట్లు జేఎఫ్‌డీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి కారణంగా ఆగస్ట్ 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలను మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది. తౌబల్ జిల్లాలో ఏర్పాటు చేసిన జనగణన శిక్షణా కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ట్రక్కులు ఢీ..

## నలుగురు మృతి.. ఏడుగురికి గాయాలు



న్యూఢిల్లీ, ఆగష్టు 20:హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్, మండి జిల్లా, చండీగఢ్-మనాలి నేషనల్ హైవేపై, హనోగి టన్నెల్ లోపల గురువారం ఉదయం జరిగింది.

టన్నెల్ లోపల ఉదయం 7.45 గంటలకు రెండు ట్రక్కులు వేగంగా వెళ్తూ, ఎదురెదురుగా ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో వాహనాల ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ట్రక్కుల్లోని ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. బాధితుల్ని బయటకు తీసి రక్షించే చర్యలు చేపట్టాయి. గాయపడ్డవారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. అయితే, తీవ్రగాయాల కారణంగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో నెర్‌చౌక్ మెడికల్ కాలేజీకి తరలించారు. టన్నెల్ లోపల ఈ ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయ ఏర్పడింది. అయితే, పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని మండి జిల్లా ఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలపై విశ్లేషిస్తున్నామన్నారు.

# విశాఖలో దారుణం.. తరగతి గదిలో కుప్పకూలిన బాలుడు

విశాఖపట్నం, ఆగస్టు 20: విశాఖలో దారుణం జరిగింది. టీచర్ కొట్టడంతో తరగతి గదిలోనే ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ కుప్పకూలిపోయాడు. విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాబు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు.

హోంవర్క్ చేయలేదని టీచర్ మందలించడంతో పాటు దాడి చేయడం కారణంగానే ప్రణయ్ మరణించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కేజీహెచ్‌లో బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారిని కొట్టిన టీచర్‌తో పాటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏసీబీ వలలో ఎమ్మార్వో.. 15 బృందాలతో సోదాలు

హైదరాబాద్, ఆగస్టు 20: ఏసీబీ అధికారుల వలలో మరో ఉన్నతాధికారి చిక్కారు. భారీ అవినీతి, అక్రమాస్తుల ఆరోపణల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మార్వోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి నివాసంలో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అతడి బంధువులు, స్నేహితులకు చెందిన 15 చోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో ఈ సోదాలు చేపట్టారు. ఆస్తులు, నగదు, బంగారంపై శ్రీనివాస్ రెడ్డిని ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీనివాస్ రెడ్డి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ ఎమ్మార్వోగా విధులు నిర్వహించారు. ఈ సమయంలో కూడా ఆయనపై భారీగా అవినీతి ఆరోపణలు వచ్చినట్లు సమాచారం.

# రామకృష్ణాపూర్ అభివృద్ధికి పెద్దపీట : మంత్రి పొన్నం



హన్మకొండ, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి)ఎల్కతుర్తి మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న -పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఆయన ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.

గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో వాటిపై చర్చించిన మంత్రి.. సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రామకృష్ణాపూర్ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన నేపథ్యంలో పంచాయతీ భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

గ్రామంలో 50 మందికి నెలకు రూ.14.97 లక్షల మేర పింఛన్లు అందుతున్నాయని మంత్రి వెల్లడించారు. తొలి దశలో మంజూరైన రెండు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో దశలో అర్హులైన వారికి మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. 52 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా రూ.40.39 లక్షల లబ్ధి చేకూరిందని, 65 కుటుంబాలకు రూ.500 గ్యాస్ సబ్సిడీ కింద రూ.6.50 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామంలోని 610 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.55.89 లక్షలు, ఇద్దరు రైతులకు రైతు బీమా కింద రూ.10 లక్షలు అందించామని తెలిపారు. రైతు రుణమాఫీ కింద రూ.4.08 లక్షలు, సన్న వడ్ల బోనస్ కింద రూ.25.50 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. కొత్తగా అర్హత పొందిన ఎనిమిది మందికి రేషన్ కార్డులు అందించామని, భూ భారతి కింద వచ్చిన 20 దరఖాస్తుల్లో ఎనిమిదింటిని పరిష్కరించామని చెప్పారు. గ్రామంలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేసి ప్రజలు పక్క గ్రామానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు హనుమాన్, పోచమ్మ ఆలయాల అభివృద్ధి, అంతర్గత సీసీ రోడ్లు, తిమ్మాపూర్ నుంచి రహదారి పూర్తి, కమ్యూనిటీ హాల్ తదితర పనులకు సానుకూలంగా స్పందించారు. పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని సర్పంచ్‌ను ఆదేశించారు.

కొత్త పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజా పాలనలో భాగంగా కొత్త పింఛన్ల ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 173 గ్రామాల్లోని 289 మహిళా సంఘాలకు 13 రకాల స్టీల్ సామగ్రిని అందిస్తున్నట్లు చెప్పారు.

పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా రామకృష్ణాపూర్‌లో 37 ఇళ్లకు సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. మరింత మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. 'జల సిరి' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

చిన్న గ్రామమైన రామకృష్ణాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంత రమేష్, జిల్లా, మండల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని కొనసాగించాలని ధర్నా ..ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత



నాగర్ కర్నూల్ ఆగష్టు 20: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనర్దన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహా ధర్నా, భారీ ర్యాలీ నిర్వహించారు.

మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డ బరువు కావద్దనే ఉద్దేశం తో ప్రవేశపెట్టిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి పథకానికి తోడుగా కొత్త జంటలకు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నెరవేర్చకపోగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని. ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చేందుకు కేవలం ఐదు మంది మాత్రమే వెళ్లాలంటూ పోలీసులు అడ్డుకోవడంతో కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కార్యకర్తలకు , పోలీసులకు తోపులాట జరిగింది. ఈ క్రమంలో స్థానిక సీఐ అశోక్ రెడ్డికి మర్రి జనార్దన్ మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు కాకి చొక్కా వేసుకుని కాంగ్రెస్ కార్యకర్తల మాదిరి పనిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాటి పౌరుల అనుభవాల పునాదులపై నేటి యువత ప్రగతి పథంలో నడవాలి !

## (21 ఆగష్టు "జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం" సందర్భంగా)

భారత దేశంలో 60 ఏండ్లు లేదా ఆ పైన వయస్సు కలిగిన ప్రజలను "సీనియర్ సిటిజెన్స్" లేదా "వయోవృద్ధులు"గా వర్గీకరిస్తాం. భారత్‌లో పన్నుల విభాగం నిర్వచనం ప్రకారం, 60 నుంచి 79 ఏండ్ల వయస్సు ఉన్న వారిని "సీనియర్ సిటిజెన్స్" అని, 80 ఏండ్లు లేదా ఆపైన వయస్సు కలిగిన వీరిని "సూపర్ సీనియర్ సిటిజెన్స్" అని పిలుస్తాం. నిన్నటి కాలంలో హీరోలు, పౌర సమాజానికి నాయకత్వం వహించిన వారు, అపార అనుభవాల పుట్టలు, వివేకవంతులు, నేటి యువతకు సరైన మార్గనిర్దేశకులు అయిన సీనియర్ సిటిజెన్స్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అమెరికా పూర్వ అధ్యక్షులు రొనాల్డ్ రీగన్ చొరవతో ప్రతి ఏట 21 ఆగష్టు రోజున "జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం (నేషనల్ సీనియర్ సిటిజెన్స్ డే)"ను పాటించడం 1988 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంస్థలు, పౌర సమాజం వయో వృద్ధులను తగు రీతిలో గౌరవంగా చూసుకోవడంతో పాటు వారు నిర్వహించిన పాత్రను తగు రీతిలో గుర్తు చేసుకుంటూ, వారి అభిప్రాయాలకు విలువను ఇస్తూ, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ, వారికి కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ, వారి హక్కులను గౌరవిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించడం ఈ దినోత్సవ ప్రత్యేకతగా గమనించాలి.

జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం-2026 ఇతివృత్తం:

1988లో అమెరికాలో ప్రారంభమైన జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినం ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస కూడా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తులు చేయడం జరుగుతున్నది. వయో వృద్ధులు నేటి సమాజ పునాది రాళ్లు అని గమనించి వారిని సముచితంగా గౌరవించుకోవడం, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం, వారి సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేయడం కొనసాగుతూనే ఉండాలని ఐరాస సూచిస్తున్నది. జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సమ్మిళిత భవిష్యత్తుకు వయోవృద్ధుల గళాలను బలోపేతం చేయడం" లాంటి అంశాన్ని తీసుకొని అవగాహన కలిపించడం జరుగుతున్నది. పథక రచనలు, పౌర సమాజ సమస్యలు, కుటుంబ ఇబ్బందులకు పరిష్కారాలు ఇవ్వడంలో సీనియర్ సిటిజెన్స్ అభిప్రాయాలను ఆచరణలో పెట్టాలని నేటి తరం గుర్తుంచుకోవాలి. వయోవృద్ధులకు ప్రాధాన్యం ఇస్తూనే వారి విజయ గాధలను ప్రచారం చేయడం, వారి సూచనలు పాటించడం జరిగిన నాడు సమాజంలో శాంతి నెలకొంటుందని మరువరాదు. వయోవృద్ధులతో నేటి తరం వయస్సు వ్యత్యాసాలను మరిచి అందరూ కలిసి ఆనందంగా గడపడం కూడా వయోవృద్ధుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది.

సీనియర్ సిటిజెన్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:

నేటి పౌర సమాజంతో డిజిటల్ కాలపు యువత తమ ఇంట్లోని వయో వృద్ధులను చిన్న చూపు చూడడం, వారికి ఏమీ తెలియదు అన్నట్లుగా భావించడం కొనసాగుతున్న ఏఐ యుగంలో ఉన్నాం. కొన్ని సందర్భాల్లో మనవడు లేదా మనుమరాలు కూడా తాతను పట్టించుకోవడం లేదు, వారి అభిప్రాయాలను అడగడం లేదు సరికదా వారిని ఒక కుటుంబ సభ్యుడిగా కూడా చూడడానికి సంకోచిస్తున్నారు. నేటి జనాభాలో 22 శాతంగా ఉన్న వయో వృద్ధులను గత చరిత్ర నిర్మాతలుగా చూడడం మంచిది. వారి విజ్ఞాన వివేకాలు నేటి తరానికి చక్కటి మార్గాన్ని చూపుతాయి. కుటుంబ సాంప్రదాయాలను సూచించడం, వివేకంతో సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపడం, ఆరోగ్యం సహకరిస్తే సీనియర్ సిటిజెన్స్ స్వచ్ఛందంగా రంగంలోకి దిగి సేవలు చేయడం జరుగుతుంది. నేటి వయో వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులు, ఒంటరితనం, నిరాదరణ, అనారోగ్య సేవలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక బలహీనతలు, కీళ్ల నొప్పులు, సులభంగా నడవలేక పోవడం, కుటుంబం పై ఆధారపడడం, చిన్న చూపు లేదా వేదనలకు గురి కావడం, సామాజిక సహాయం కొరవడడం, సౌకర్యాల లేమి, అంగ వైకల్యం, సహాయం చేసే చేతులు లేకపోవడం, సామాజిక బహిష్కరణ లాంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వివిధ తరాల సమావేశాలు, ప్రోత్సాహక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, వయో వృద్ధులకు తగు సేవలు చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, సీనియర్ సిటిజెన్స్ సేవా కేంద్రాల్లో స్వచ్ఛందంగా పని చేయడం, వయోజనుల విజయ గాధలను ప్రచారం చేయడం లాంటి కార్యక్రమాలకు జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినం వేదిక కావాలి. సీనియర్ సిటిజెన్స్ దినం రోజున వయో వృద్ధుల ముఖాల్లో నవ్వుల పువ్వులు చూడడానికి ప్రయత్నించాలి. సీనియర్ సిటిజెన్స్‌కు సంబంధించిన నినాదాలను ప్రచారం చేయాలి. మనల్ని కంటికి రెప్పలా పెంచి మంచి స్థాయిని కల్పించి, తమ సంపాదనను మన ఎదుగుదలకు నీళ్ల వలె ఖర్చు చేసిన వయో వృద్ధులను గుండెలో పెట్టుకొని చూసుకోవడం మన కనీస కర్తవ్యం. వయో వృద్ధులు సజీవ గ్రంధాలయాలు, అపార వివేక నిఘంటువులు. నిన్నటి రోజుల్లో నేటి వయో వృద్ధులు చేసిన అద్వితీయ సేవలను గుర్తు చేసుకుంటూ, మన ఎదుగుదలకు వారి సలహాలను మెట్లు తీసుకుంటూ, వారితో కలిసి కుటుంబం సంతోషంగా సాగిపోవడమే మన ముందున్న ఏకైక మార్గం అని మరువరాదు. నేటి యువత కూడా రేపటి వయో వృద్ధులని గుర్తుంచుకోవాలి. సీనియర్ సిటిజెన్స్‌కు నేటి తరం ఊత కర్రలు కావాలి. నేటి తరం యువత ఎగరడానికి వయోవృద్ధుల అనుభవాలను రెక్కలుగా మార్చుకోవాలి. వయోభేదం మరిచి సమ్మిళిత పౌర సమాజ స్థాపనకు కృషి జరగాలి.



-మధుపాళీ
9949700037

# పోలీస్ ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం.. హోంమంత్రి ఆరా

విశాఖపట్నం, ఆగష్టు 20: విశాఖపట్నం జూపార్క్ సమీపంలో పోలీస్ ఎస్కార్ట్ వాహనం ప్రమాదానికి గురైంది. విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది ప్రయాణిస్తున్న ఎస్కార్ట్ వాహనం ప్రమాదానికి గురికావడంతో పలువురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే దానిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

ఈ ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ప్రమాదంలో పోలీసు సిబ్బంది గాయపడిన విషయం తెలుసుకున్న ఆమె, విశాఖ నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీసు ఉన్నతాధికారులను హోంమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. విశాఖలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు సిబ్బందికి అవసరమైన వైద్య సేవలు ఎలాంటి లోటు లేకుండా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయాన్ని వెంటనే అందించాలని స్పష్టం చేశారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందికి జరిగిన ప్రమాదంపై హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేస్తూ, గాయపడిన కానిస్టేబుళ్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనం ఎలా అదుపు తప్పిందన్న అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇస్లాంపూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు..

## -నకిలీ నంబర్ ప్లేట్లతో 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం..

## -గంజాయి, అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం



ఆదిలాబాద్, ఆగష్టు 20: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా గురువారం ఇచ్చోడ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచి తనిఖీలు చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 110 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చిన 15 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఏఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. గంజాయి సేవించడం, నిల్వ చేయడం, రవాణా చేయడం, సరఫరా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం, అక్రమంగా తరలించడం నేరమని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించిన ఏఎస్పీ.. కాలనీ ప్రజలు కలిసికట్టుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు సీహెచ్ రమేష్, కె. నరేష్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎన్. చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నూరులో కాకా ఫ్రీ కోచింగ్ అడ్మిషన్లు ప్రారంభం

ఆదిలాబాద్, ఆగష్టు 20: మంత్రి చేతులమీదుగా చెన్నూర్ పట్టణ కేంద్రంలో ప్రారంభమైన కాకా ఫ్రీ కోచింగ్ క్యాంప్ అడ్మిషన్లు నేటినుంచి ప్రారంభం అయ్యాయి. క్యాంప్ కు సంబందించిన అడ్మిషన్ ల దరఖాస్తులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బంది స్వీకరిస్తున్నారు. 60 రోజులు నిర్వహించే క్యాంప్ లో ఎస్సై, కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టులను అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధించబడును. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతీ యువకులు దరఖాస్తు చేసుకొవాలని కోరారు.

# వారణాసి విమానాశ్రయంలో ప్రమాదవశాత్తూ పేలిన లైసెన్స్ ఆయుధం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 20: వారణాసి నుంచి ముంబయికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఎచీ 1810లో ఈ రోజు సుమారు 09:30 గంటలకు ప్రయాణించవలసిన కమలేష్ కేదార్‌నాథ్ రాయ్ అనే ప్రయాణికుడు... నిర్దేశిత విధానం ప్రకారం చెక్-ఇన్ కౌంటర్ వద్ద లైసెన్స్ గల తన తుపాకీని (21 తూటాలతో కూడిన 7.62 ఎమ్ఎమ్ పిస్టల్) అందజేశారు.

తప్పనిసరి భద్రతా ప్రక్రియలను పూర్తి చేయడం కోసం ప్రయాణికుడిని సిబ్బంది నిర్దేశిత స్క్రీనింగ్ ప్రాంతానికి తీసుకు వెళ్లారు. ప్రక్రియలో భాగంగా ఆయుధాన్ని తనిఖీ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఒక తూటా పేలింది. ఆ తూటా పక్కకు దూసుకెళ్లడంతో స్క్రీనింగ్ సిబ్బంది రోహిత్ రాజ్, సుమన్ కుమారిలకు గాయాలయ్యాయి.

గాయపడిన ఇద్దరు సిబ్బందికి తక్షణం ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్య చికిత్స కోసం వారణాసిలోని న్యూలక్ష్మి ట్రామా సెంటర్‌కు తరలించారు.

సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విచారణ, చట్టపరమైన తదుపరి చర్యల నిమిత్తం ఆ ప్రయాణికుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విమానాశ్రయాల్లో లైసెన్స్ పొందిన ఆయుధాలను వెంట ఉంచుకోవడం, తమతో పాటు తీసుకువెళ్ళడానికి నిర్దేశించిన విధానాలను సదరు ప్రయాణికుడు పాటించారా లేదా అనే విషయం గా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిశితంగా పరిశీలిస్తోంది. పరిశీలనలో తేలిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

సంఘటన జరిగిన వెంటనే విమానాశ్రయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. విమానాశ్రయ కార్యకలాపాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నాయి.

# దొరికిన ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన వృద్ధుడు..

ఆదిలాబాద్, ఆగష్టు 20: నేటి సమాజంలో విలువైన వస్తువు దొరికితే సొంతం చేసుకోవాలని చూస్తున్న రోజుల్లో 80 ఏళ్ల వృద్ధుడు తన నిజాయితీని చాటుకున్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన పురం శెట్టి కనకయ్య (80) సింగరేణి సంస్థలో ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయ్యారు. బుధవారం ఆయనకు దారిలో ఓ విలువైన మొబైల్ ఫోన్ దొరికింది. దానిని తన వద్ద ఉంచుకోకుండా వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి అప్పగించారు.

# '2026 సంవత్సర సైబర్ కుస్తీ'ని ప్రారంభించిన ఎన్ఐఈఎల్ఐటీ...

న్యూఢిల్లీ, ఆగష్టు 20: కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞ?న మంత్రిత్వశాఖ (ఎమ్ఈఐటీవై) పరిధిలోని జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞన సంస్థ (ఎన్ఐఈఎల్ఐటీ), 2026 ఆగస్టు 15న '2026 సంవత్సర సైబర్ కుస్తీ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది జాతీయ సైబర్ భద్రత, కృత్రిమ మేధ (ఏఐ)లకు సంబంధించిన ఒక హ్యాకథాన్. సైబర్ భద్రత మూల్యాంకనం పట్ల మనుషులకున్న అవగాహనను, నిర్ణయాలను తీసుకునే సామర్థ్యాలను పరిశీలించడానికి, గుర్తించడానికి ఈ హ్యాకథాన్‌ను ఉద్దేశించారు.

ఈ హ్యాకథాన్‌ను ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్, ఎన్ఐఈఎల్ఐటీ డీమ్డ్ విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ (డాక్టర్) ఎమ్.ఎమ్. త్రిపాఠీ లాంఛనంగా ప్రారంభించారు. ఇది సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్, ఇంటెలిజెన్స్ విషయాలపై ఏర్పాటు చేసిన మూడో జాతీయ సమావేశానికి ('ఎన్‌సీసీడీఎఫ్ఐ 2026') అధికారిక సమానాంతర టెక్నికల్ ట్రాక్‌గా ఉంటుంది. ఈ పోటీని జాతీయ భద్రత డేటాబేస్ (ఎన్ఎస్‌డీ)లో భాగంగా ఇన్ఫర్మేషన్ షేరింగ్, ఎనాలిసిస్ సెంటర్ (ఐఎస్ఏసీ ఫౌండేషన్) సహకారంతో నిర్వహిస్తున్నారు. దీనిలో 'సీఈఆర్‌టీ-ఐఎన్' విజ్ఞన భాగస్వామిగా పాల్గొంటోంది.

'2026 సంవత్సర సైబర్ కుస్తీ'కి నమోదుల ఘట్టాన్ని ఆగస్టు 15న మొదలుపెట్టారు. ఈ ప్రక్రియను ఈ ఏడాది సెప్టెంబరు 10 వరకూ అందుబాటులో ఉంచుతారు. దీనిలో పాల్గొనడం ఉచితం. ముగ్గురు సభ్యుల బృందాలతో పాటు స్వతంత్ర పరిశోధకులకు కూడా దీనిలో పాలుపంచుకోవడానికి అవకాశం ఉంటుంది.

కేవలం లోటుపాటులను గుర్తించడానికే కాకుండా, సరి అయిన నిర్ణయాలను తీసుకోవడం ప్రధానంగా సాగే హ్యాకథాన్

సైబర్‌భద్రతతో ముడిపడిన లోటుపాట్లను అన్వేషించడంపైన లేదా క్యాప్చర్ ది ఫ్లాగ్ (సీటీఎఫ్) సవాళ్లపైన దృష్టిని కేంద్రీకరించే సాధారణ పోటీలకు భిన్నంగా ఈ పోటీ ఉంటుంది. '2026 సంవత్సర సైబర్ కుస్తీ'ని.. దీనిలో పాల్గొనే వారికి సైబర్ భద్రతకు సంబంధించిన నిర్ణయాల్ని మూల్యాంకనం చేసే, వాటికి ప్రాధాన్య క్రమాన్ని సూచించే, ఆ నిర్ణయాలను రక్షించే సామర్థ్యాలు ఏమేరకు ఉన్నాయో పరీక్షించడానికి రూపొందించారు.

పోటీలో పాల్గొనే ప్రతి బృందానికీ ఒకే రకమైన, ఉద్దేశపూర్వకంగా అసంపూర్ణంగా వదిలిపెట్టిన 'భద్రత మూల్యాంకన ప్యాకేజీ'ని ఇస్తారు. దీనిలో కృత్రిమ మేధ సాయం తీసుకుని రూపొందించిన సమాచారం, స్టాటిక్ ఎనాలిసిస్ ఫలితాలు, డిపెండెన్సీ, సీక్రెట్ స్కాన్లు, ఆర్కిటెక్చర్ డాక్యుమెంటేషన్, సోర్స్ కోడ్‌లతో పాటు అప్లికేషన్ లాగ్స్ కలిసి ఉంటాయి.

నిజం కాని విషయాలను, మళ్లీ మళ్లీ ప్రస్తావించిన విషయాలను, కనుక్కున్న విషయాలను ప్యాకేజీలో చేరుస్తారు. కొన్ని వాస్తవిక బలహీనతలను కావాలనే వదిలేస్తారు. సరి అయిన, ప్రాధాన్య పూర్వక భద్రతా మూల్యాంకనాన్ని బృందాలు సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, తీసుకున్న నిర్ణయాలను అవి సమర్థించుకోవాలి. పోటీలో పాల్గొనే వారు వాస్తవిక అంశాలను గుర్తించినందుకే కాక, కనుక్కున్న విషయాల్లో నిజం కాని వాటిని సరైన పద్ధతిలో తోసిపుచ్చినందుకు కూడా వారికి పురస్కారాలను అందజేస్తారు.

ఈ సందర్భంగా ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డాక్టర్) ఎమ్.ఎమ్. త్రిపాఠీ మాట్లాడుతూ, "భద్రతకు సంబంధించిన పనిలో అన్నింటి కన్నా కష్టమైన భాగం ప్రస్తుతం మార్పునకు లోనైంది. ఒక తరం వరకూ చూసినప్పుడు, సమస్యను గుర్తించడమే అన్నింటి కన్న కష్టమైన పనిగా ఉండేది. ప్రస్తుతం, ఏ బృందానికైనా సరే చదవడానికి సంబంధించి ఉన్న వేగంతో పోలిస్తే, యంత్రాలు చాలా ఎక్కువ వేగంతో ఫలితాల్ని అందించ గలుగుతున్నాయి. అయితే అవి కూడా ఏయే ఫలితాలు సిసలైనవో, ఏవి చాలా అవసరమైనవో, వేటిని ముందుగా సరిదిద్దాలో అనే విషయాలను భరోసా కలిగించేటట్లు సూచించలేకపోతున్నాయి. సరి అయిన నిర్ణయాన్ని తీసుకునే ఈ రకమైన సామర్థ్యాన్నే మన సంస్థలు అభివృద్ధిపరచాల్సి ఉంది. మరి ఈ విధమైన సామర్థ్యాన్ని పరిశీలించడమే ఈ పోటీ నిర్వహణ వెనుక ఉన్న ముఖ్యోద్దేశం" అని పేర్కొన్నారు.

ఉపకరణం ద్వారా రూపొందించిన సమాచారాన్ని అన్ని బృందాలకూ ఏక కాలంలో అందిస్తున్న నేపథ్యంలో, ఖరీదైన భద్రతా ఉపకరణాలతో కలిగే ప్రయోజనం వీలయినంత తక్కువగా ఉండేలా ఈ పోటీకి సంబంధించిన ఫార్మేట్‌ను నిర్దేశించారు. అంతేకాదు, పోటీలో పాల్గొనే వారు తమకు నచ్చిన ఏ కృత్రిమ మేధా సంబంధిత ఉపకరణాలను అయినా సరే, యథేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు కూడా.

ప్రొఫెసర్ (డాక్టర్) ఎమ్.ఎమ్. త్రిపాఠీ మరిన్ని అంశాలను వెల్లడిస్తూ, "దేశంలో ఏ ప్రాంతానికి చెందిన కాలేజీ విద్యార్థి అయినా ఏ కార్పొరేట్ బృందంతో సమానంగా పోటీ పడవచ్చు. ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి వెసులుబాటును కల్పించారు. మేం ఈ పోటీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎందుకు మొదలుపెట్టామంటే, యంత్రాలు వేగంగా సత్తాను సమకూర్చుకుంటున్న ఈ కాలంలో స్వాతంత్ర్యానికి ఒక నిర్దిష్ట అర్థం ఉంది.. అది, మీకు ఇచ్చిన వస్తువును పరిశీలించే, దాంతో సమ్మతించకపోయే, అది ఎందుకు ఇలా ఉన్నదీ స్పష్టం చేసే ఆత్మవిశ్వాసాన్ని అందించాలనేదే"నని వివరించారు.

ఒకటో దశ 'అఖండ': ఈ రౌండును 2026 సెప్టెంబరు 15న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. దీనిలో పాల్గొన్న బృందాల్లో నుంచి 50 బృందాలు ముందంజ వేస్తాయి.

రెండో దశ 'దంగల్': ఈ రౌండును 2026 సెప్టెంబరు 24న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. దీనిలో పాల్గొన్న బృందాల్లో నుంచి 10 బృందాలను తుది రౌండులో పాల్గొనడానికిగాను ఎంపిక చేస్తారు.

ఆఖరి రౌండు 'కేసరి': ఈ రౌండును 2026 అక్టోబరు 9న న్యూఢిల్లీ లోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో నిర్వహిస్తారు. తుది రౌండుకు ఎంపికైన పది బృందాలు 'ఎన్‌సీసీడీఎఫ్ఐ 2026' ప్రధాన వేదికపై తమ మూల్యాంకనాలను సమర్పించి, వాటిని సమర్థించుకోవడానికన్నా ముందు నిపుణుల పర్యవేక్షణలో పనిచేస్తాయి.

ఆఖరి రౌండు కొనసాగే క్రమంలో, బృందాల ప్రెజెంటేషన్లతో పాటు వాటి మూల్యాంకన సామగ్రికి సంబంధించిన ఆటోమేటెడ్ విశ్లేషణను కూడా చేపడతారు. దీంతో యంత్రం రూపొందించిన విశ్లేషణ, నిపుణులైన మానవుల అభిప్రాయాలు ఎక్కడెక్కడ ఒకే విధంగా ఉన్నాయో, ఎక్కడెక్కడ తేడాలు ఉన్నాయో పరిశీలించేందుకు ప్రతినిధులకు అవకాశం లభిస్తుం ది.

తుది రౌండులో పాల్గొన్న వారి మూల్యాంకనాన్ని ఎన్ఐఈఎల్ఐటీ, ఐఎస్ఏసీలు కలిసి ఏర్పాటు చేసిన ఒక ప్రతిష్ఠాత్మక న్యాయ సహాయక బృందం చేపడుతుంది. ఈ జూరీలో ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, విద్యా రంగాలకు చెందిన సీనియర్ సైబర్‌భద్రత రంగ నిపుణులు సభ్యులుగా ఉంటారు. వారిలో జాతీయ భద్రత డేటాబేస్ (ఎన్ఎస్‌డీ) గుర్తింపును పొందిన జాతీయ సైబర్ భద్రత పండితులు కూడా ఉంటారు.

విజేతగా నిలిచిన బృందానికి "సైబర్ కేసరి 2026" పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. సాంప్రదాయిక గదను కూడా అందిసారు. రన్నర్స్-అప్ బృందాలకు ''రుస్తుమ్'', ''పహిల్వాన్'' బిరుదులతో సత్కరిస్తారు.

ఒకటో రౌండులో పాల్గొన్న వారికి భాగస్వామ్య ధ్రువపత్రంతో పాటు వ్యక్తిగత స్కోర్‌కార్డును అందజేస్తారు. ఒకటో రౌండు నుంచి ముందుకు వెళ్లిన వారికి ఎన్ఎస్‌డీ రికగ్నిషన్ క్రెడిట్స్‌ను ఇస్తారు. విషయాలను తెలియజేస్తూనే సరికాని సమాధానాన్ని ఇచ్చిన వారికి కూడా ఒక ప్రత్యేక పురస్కారాన్ని అందిస్తారు. ఈ క్రమంలో.. తర్కాన్ని స్పష్టంగా అర్థం చేయించిన, నేర్చుకోవడానికి సహాయపడే సమాధానాన్ని సూచించిన వారిని సన్మానిస్తా రన్నమాట.

'2026 సంవత్సర సైబర్ కుస్తీ'లోని అన్ని కార్యకలాపాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచిన నియంత్రిత వాతావరణంలో నిర్వహిస్తారు. పోటీలో ఏ దశలో నయినా పోటీలో పాల్గొన్న వారికి లైవ్ సిస్టమ్ గాని, మూడో పక్షం లేదా సార్వజనిక మౌలిక సదుపాయాల సాయాన్ని తీసుకోవాల్సిందిగా పురమాయించరు.. అలాంటి పని చేయడానికి అనుమతించరు.

సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్, ఇంటెలిజెన్స్ విషయాలపై ఏర్పాటు చేసిన మూడో జాతీయ సమావేశం ('ఎన్‌సీసీడీఎఫ్ఐ 2026') అనేక విషయాలకు సంబంధించిన వేదిక. ఇది ప్రభుత్వాన్నీ, చట్టాన్ని అమలు పరిచే ఏజెన్సీలనూ, న్యాయ వ్యవస్థనూ, పారిశ్రామిక రంగాన్నీ, విద్యారంగాన్నీ, పరిశోధకులనూ, విద్యార్థులనూ ఒక చోటుకు తీసుకువస్తుంది. ఎన్‌సీసీడీఎఫ్ఐ మూడో సంచికను ఈ సంవత్సరంలో అక్టోబరు 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ఎన్ఐఈఎల్ఐటీ నిర్వహించనుంది.

కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞ?న మంత్రిత్వశాఖ (ఎమ్ఈఐటీవై) పరిధిలో పనిచేస్తున్న స్వతంత్ర ప్రతిపత్తి గల శాస్త్రీయ సంస్థ జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞన సంస్థ (ఎన్ఐఈఎల్ఐటీ). ఇది నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాధికారత రంగంలో అగ్రగామి సంస్థ.

56 ఎన్ఐఈఎల్ఐటీ కేంద్రాలు, 700 కన్నా ఎక్కువ అధీకృత సంస్థలతోనూ, 8,000కు పైగా ఫెసిలిటేషన్ కేంద్రాలతోనూ ఎలక్ట్రానిక్స్, సమాచార, కమ్యూనికేషన్స్ సాంకేతికత (ఈ అండ్ ఐసీటీ) రంగంలో కొత్త సాంకేతికతలలో లక్షల కొద్దీ విద్యార్థులు నైపుణ్యాన్ని సాధించుకోవడానికి ఎన్ఐఈఎల్ఐటీ దోహదపడి, వారికి ధ్రువపత్రాలను ఇచ్చింది.

విద్యామంత్రిత్వశాఖ ఎన్ఐఈఎల్ఐటీకి విశిష్ట కేటగిరీలో "డీమ్డ్ టు బి యూనివర్సిటీ" హోదాను ప్రదానం చేసింది. ఎన్ఐఈఎల్ఐటీ ప్రధాన కేంపస్ పంజాబ్‌లోని రోపడ్‌లో ఉంది. ఎన్ఐఈఎల్ఐటీకి చెందిన పదకొండు భాగాల క్యాంపసులను ఐజ్వాల్, అగర్తల, కాలికట్, ఛత్రపతి సంభాజీనగర్, గోరఖ్‌పూర్, ఇంఫాల్, ఇటానగర్, అజ్మీర్, కోహిమా, పాట్నా, శ్రీనగర్‌లలో ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్స్, సమాచార, కమ్యూనికేషన్స్ సాంకేతికత (ఈ అండ్ ఐసీటీ) రంగంలో డిజిటల్ సాంకేతికతలను సద్వినియోగపరుచుకొని ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులను తీసుకురావాలన్నదే ఎన్ఐఈఎల్ఐటీ ధ్యేయం. ఇన్ఫర్మేషన్ షేరింగ్, ఎనాలిసిస్ సెంటర్ (ఐఎస్ఏసీ ఫౌండేషన్): ఇది భారత్‌లో 8వ సెక్షన్‌లో భాగంగా నమోదై కార్యకలాపాలున నిర్వహిస్తున్న సంస్థ.

# దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని అక్రమంగా వినియోగించుకుంటూ జరుగుతున్న
# భారీ పోకచెక్కల దిగుమతి కుంభకోణాన్ని బయటపెట్టిన రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్

న్యూఢిల్లీ, ఆగష్టు 20:దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎస్ఏఎఫ్టీఏ) కింద లభించే సుంకం మినహాయింపులను అక్రమంగా పొందేందుకు ఆగ్నేయాసియా దేశాలకు చెందిన పోకచెక్కలను (అరేకా నట్స్) బంగ్లాదేశ్ నుంచి వస్తున్నట్లు నకిలీ వివరాలు చూపిస్తూ దిగుమతి చేసుకుంటున్న ఒక భారీ నెట్‌వర్క్‌ను రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆరఐ) నెల రోజుల పాటు సాగించిన నిఘా ఆపరేషన్‌లో ఛేధించింది. దీనివల్ల ప్రభుత్వానికి రూ.2,500 కోట్లకు పైగా ఆదాయ నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో సంబంధం ఉన్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు.

భారత్‌లోకి పోక చెక్కల దిగుమతులపై 100 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధిస్తారు. అయితే, ఎస్ఏఎఫ్టీఏ ఒప్పందం కింద అర్హత కలిగిన పోక చెక్కల దిగుమతులకు కస్టమ్స్ సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు ఉంటుంది. నిర్దేశించిన మూల దేశ నిబంధనల ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే బంగ్లాదేశ్‌లో ఉత్పత్తి అయిన పోకచెక్కలకు ఎస్ఏఎఫ్టీఏ కింద కస్టమ్స్ సుంకం మినహాయింపు లభిస్తుంది.

కొన్ని సిండికేట్లు పోకచెక్కల దిగుమతులపై అత్యంత భారీ స్థాయిలో సాఫ్టా మినహాయింపు ప్రయోజనాలను మోసపూరితంగా పొందుతున్నట్లు డిఆర్ఐ సేకరించిన సమాచారంలో వెల్లడైంది. ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియా, ఇతర ఆగ్నేయాసియా దేశాల నుంచి సేకరించి, దిగుమతి చేసుకుంటున్న పోకచెక్కలను తిరిగి దిగుమతి చేసే క్రమంలో వాటి ఉత్పత్తి తయారీ దేశం బంగ్లాదేశ్ అంటూ నకిలీ వివరాలు చూపిస్తున్నట్లు తేలింది.

కోల్‌కతా, విశాఖపట్నంలలోని దిగుమతిదారులు, కస్టమ్స్ బ్రోకర్లు, ఐఈసీ హోల్డర్లకు చెందిన పలు ప్రాంగణాల్లో ఏకకాలంలో జరిపిన సోదాల్లో పోకచెక్కల మూలం ఆగ్నేయాసియా దేశాలేనని రుజువు చేసే అనేక కీలక పత్రాలను, ముఖ్యమైన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా దిగుమతి చేసుకున్న సరుకు అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్ముగా భావిస్తున్న సుమారు రూ. 75 లక్షల నగదును కూడా డిఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం రవాణాలో ఉన్న దాదాపు 160 మెట్రిక్ టన్నుల పోకచెక్కల కన్సైన్మెంట్‌ను కూడా జప్తు చేశారు.

ఇటీవలి సంవత్సరాలలో పోకచెక్కల మోసపూరిత దిగుమతులు భారీ స్థాయిలో జరిగాయని, దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 2,500 కోట్లకు పైగా కస్టమ్స్ సుంకం నష్టం వాటిల్లిందని ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో వెల్లడైంది. ఈ కుంభకోణానికి సూత్రధారులు ఆగ్నేయాసియా దేశాల నుంచి పోకచెక్కలను బంగ్లాదేశ్‌లోని ఒక నిర్దేశిత ఎగుమతి ప్రాసెసింగ్ జోన్ కు దిగుమతి చేసుకునేలా సహకరించారు. ఆ తర్వాత కేవలం కంటైనర్లు, సంచులను మార్చి, ఆ సరుకు బంగ్లాదేశ్ మూలానికి చెందిందేనంటూ నమ్మించి భారతదేశానికి తరలిస్తున్నారు. వీరు బంగ్లాదేశ్ అధికారుల నుంచి మోసపూరితంగా 'సాఫ్టా' కంట్రీ ఆఫ్ ఆరిజిన్ సర్టిఫికెట్లను పొందారు. ఈ కన్సైన్మెంట్ల దారి మళ్లింపు, డాక్యుమెంటేషన్, క్లియరెన్స్, రవాణా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూభారీ మొత్తంలో నగదు రూపంలో చెల్లింపులు స్వీకరిస్తూ ఈ వ్యవహారానికి సూత్రధారులుగా ఉన్నవారు భారతీయ దిగుమతిదారుల నుంచి పెద్ద ఎత్తున కమిషన్లను వసూలు చేస్తున్నారు. ఈ నిధుల మళ్లింపు, వాటిని వివిధ పద్ధతుల్లో దాచిపెట్టే ప్రక్రియ కోసం హవాలా మార్గాలు, డమ్మీ సంస్థలను ఉపయోగించినట్లు కూడా దర్యాప్తులో వెలుగుచూసింది.

ఈ కేసులో మెజారిటీ మోసపూరిత పోకచెక్కల దిగుమతుల క్లియరెన్స్‌కు ముఖ్యంగా ఒకే కస్టమ్స్ బ్రోకర్ సంస్థ కారణమని దర్యాప్తులో వెల్లడైంది. డిఆర్ఐ చేపడుతున్న ప్రస్తుత దర్యాప్తును పురస్కరించుకుని, సదరు కస్టమ్స్ బ్రోకర్ లైసెన్స్‌ను సంబంధిత అధికారి సస్పెండ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు తొమ్మిదిమందిని అరెస్టు చేశారు.

ఇటువంటి అక్రమ దిగుమతులు మార్కెట్‌లో ధరలను ప్రభావితం చేయడమే కాకుండా, చట్టబద్ధంగా వ్యాపారం చేసే సంస్థలకు సమాన అవకాశాలు లేకుండా చేస్తూ దేశీయ పోకచెక్కల రైతులను, న్యాయబద్ధమైన వాణిజ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఈ అక్రమ కార్యకలాపాలు ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగించడంతో పాటు, నియంత్రిత వాణిజ్య పద్ధతులను, సరిహద్దు ప్రాంతాల ఆర్థిక భద్రతను కూడా దెబ్బతీస్తాయి.ఒక దేశం వివరాలను పద్ధతి ప్రకారం తప్పుగా ప్రకటించడం, సాఫ్టా ప్రయోజనాలను మోసపూరితంగా పొందడం, భారీ స్థాయిలో కస్టమ్స్ సుంకాలను ఎగవేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఈ ఆపరేషన్ ద్వారా డీఆర్ఐ సమర్థవంతంగా ఛేదించింది

## మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

**-రాష్ట్ర స్థాయిలో జిల్లాకు రెండవ స్థానం**

**-ఈగల్ టీమ్ ప్రశంసలు**


**-సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

కరీంనగర్, ఆగష్టు 20:రాజన్న సిరిసిల్లను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని, ఆ దిశగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా జూన్ 22 నుండి 26 వరకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం తోపాటు ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా ఉండేలా పాఠశాలలు, కళాశాలలు, యువత, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తాం..

**-రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

కరీంనగర్, ఆగష్టు 20:మాజీ ప్రధాని స్వర్గీయ



రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా స్థానిక జీఎం కార్యాలయ ప్రాంతంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ అజాతశత్రువుగా గుర్తింపు పొందారని అన్నారు. భారతదేశ అభివృద్ధికి సంబంధించి రాజీవ్ గాంధీ ఎన్నో వ్యూహాత్మక ఆలోచనలు చేశారని గుర్తు చేశారు. దేశ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, నగర కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు గట్ల రమేష్, నాయకులు కాలువ లింగస్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతా..



కరీంనగర్, ఆగష్టు 20:రామగుండం నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు. గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌టీపీసీ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు.

భవిష్యత్తులో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల వైపు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగానే రామగుండం నియోజకవర్గానికి సమీకృత పాఠశాల మంజూరైందని, త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు అన్ని రకాల మౌలిక వసతులతో పాఠశాలలను అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని, సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు ఎన్‌టీపీసీ విద్యుత్ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద సైకిళ్ల పంపిణీ చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, ఎంఈఓ మల్లేష్‌తో పాటు నగర కార్పొరేటర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ కృషి కీలకం..

కరీంనగర్, ఆగష్టు 20: ప్రపంచ దేశాలతో పోటీపడుతూ భారత్ గర్వించే స్థాయికి ఎదగడంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలోని నంది చౌరస్తాలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో దేశంలో కంప్యూటరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఆయన తీసుకున్న నిర్ణయాల స్ఫూర్తితో అభివృద్ధి చెందిన సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు లభించిందన్నారు. లక్షలాది మంది యువత నైపుణ్యాలను పెంచుకుని ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటానికి ఆ విధానాలు దోహదపడ్డాయని పేర్కొన్నారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని మంత్రి గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి నాయకులు ప్రాణ త్యాగాలు చేశారని పేర్కొన్నారు.

నేటి యువత రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు వేముల రాజు, సొల్ల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం

**-కరీంనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**-రూ.1.50 కోట్ల యూఐడీఎఫ్, మున్సిపల్ నిధులతో పలు పనులు**

**-రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

కరీంనగర్, ఆగష్టు 20:కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. గురువారం నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

నగరంలోని 39వ డివిజన్ కోతిరాంపూర్‌లోని పోచమ్మవాడలో రూ.90 లక్షల యూఐడీఎఫ్ నిధులతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 54వ డివిజన్‌లో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైన్ పైప్‌లైన్ పనులకు, మరో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో ఆర్‌సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లు మాసం గణేష్, గొట్టిముక్కల ఉమారాణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల 8వ విడత వేలంపై రోడ్‌షోను, ఎన్ఎంఈడీటీ వర్క్‌షాప్‌ను పాట్నాలో నిర్వహించనున్న గనుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 20:కేంద్ర ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల 8వ విడత వేలంపై రోడ్‌షోనూ, జాతీయ ఖనిజ అన్వేషణ, అభివృద్ధి ట్రస్ట్ (ఎన్ఎంఈడీటీ)పై వర్క్‌షాప్‌నూ 2026 ఆగస్టు 17న బీహార్‌లోని పాట్నాలో నిర్వహించనున్నారు.

బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రి శ్రీ సమ్రాట్ చౌధరి, బిహార్ గనుల శాఖ మంత్రి డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొంటారు. బీహార్ గనుల శాఖ, భారత భూగర్భ సర్వే సంస్థ (జీఎస్ఐ), మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కన్సల్టెన్సీ లిమిటెడ్ (ఎంఈసీఎల్)కు చెందిన ఉన్నతాధికారులతో పాటు పరిశ్రమ ప్రతినిధులు, పెట్టుబడిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని భావిస్తున్నారు. ఈ 8వ విడత వేలంలో గ్రాఫైట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ), అరుదైన లోహాలు, వెనాడియం, గాలియం, టైటానియం, మోలిబ్డినం, టంగ్‌స్టన్, పొటాష్, ఫాస్ఫోరైట్, గ్లాకోనైట్ వంటి వివిధ రకాల కీలక, వ్యూహాత్మక ఖనిజాలకు చెందిన 20 బ్లాకులు ఉన్నాయి. వీటిలో 3 మైనింగ్ లీజ్ (ఎంఎల్), 17 కాంపోజిట్ లైసెన్స్ (సీఎల్) బ్లాకులు ఉన్నాయి.

రోడ్‌షో ద్వారా వేలానికి అందుబాటులో ఉన్న ఖనిజ బ్లాకుల సామర్థ్యం, వేలం విధానం, బిడ్డింగ్ ప్రక్రియ, కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలో పెట్టుబడులు, భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై ఔత్సాహిక పెట్టుబడిదారులు, పరిశ్రమ వర్గాలకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. ఖనిజ బ్లాకులపై ఎంఈసీఎల్, ఖనిజాల వేలం ప్రక్రియ, టెండర్ పత్రంపై ఎస్ బీఐసీఏపీఎస్, ఈ-వేలం ప్రక్రియపై ఎంఎస్టీసీ సంస్థలు సమగ్ర ప్రజెంటేషన్లు ఇవ్వనున్నాయి. ఎన్ఎంఈడీటీఈ కార్యక్రమంలో కాంపోజిట్ లైసెన్స్‌దారులు చేసిన ఖనిజ అన్వేషణ వ్యయాల్లో కొంత భాగాన్ని తిరిగి చెల్లించే ఎన్ఎంఈడీటీ పథకంపై కూడా ఈ కార్యక్రమంలో ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం భాగస్వామ్య వర్గాల మధ్య పరస్పర చర్చకు, వేలం ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తికి ఓపెన్ హౌస్ నిర్వహించనున్నారు.

కార్యక్రమం రెండో భాగంలో ఖనిజ అన్వేషణ: ప్రణాళిక, అములు, నివేదికల తయారీ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. భారత్‌లో ఖనిజ అన్వేషణకు ఉన్న అవకాశాలు, జాతీయ భూవిజ్ఞాన డేటా రిపాజిటరీ (ఎన్జీడీఆర్)ని ఉపయోగించి అన్వేషణ బ్లాకుల రూపకల్పన, ఖనిజ అన్వేషణ నివేదికల తయారీ వంటి అంశాలను వివరించనున్నారు. భారత భూగర్భ సర్వే సంస్థ (జీఎస్ఐ) ఉన్నతాధికారులు సాంకేతిక అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు.

ఖనిజ అన్వేషణను ప్రోత్సహించడం, కీలక, వ్యూహాత్మక ఖనిజ వనరుల అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచడం, దేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం కొనసాగిస్తున్న కృషిని ఈ కార్యక్రమం తెలియచేస్తుంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, స్వచ్ఛ ఇంధనం, ఇతర వ్యూహాత్మక రంగాలకు అవసరమైన ఖనిజాల దేశీయ అన్వేషణ, అభివృద్ధిని మరింత విస్తరించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి కూడా ఈ కార్యక్రమం తోడ్పడుతుంది.

## దేశవ్యాప్తంగా 121 టోల్‌ప్లాజాలకు డిజిటల్ ఫాస్టాగ్ లోకల్ పాస్ సౌకర్యాన్ని విస్తరించిన ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 20:భారత ప్రభుత్వ డిజిటల్ ఇండియా దార్శనికతకు, ప్రజల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచాలనే నిబద్ధతకు అనుగుణంగా దేశవ్యాప్తంగా 121 టోల్ ప్లాజాలకు ఆన్‌లైన్ ఫాస్టాగ్ లోకల్ పాసుల సౌకర్యాన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) విస్తరించింది. రాజమార్గ యాత్ర మొబైల్ యాప్ ద్వారా అర్హులైన ప్రయాణికులు ఆన్‌లైన్లో నెలవారీ లోకల్ పాసులను పొందవచ్చు. దీనివల్ల టోల్ ప్లాజాలకు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన, అవసరమైన పత్రాలను సమర్పించాల్సిన అవసరం ఉండదు. టోలింగ్ కార్యకలాపాల్లో పారదర్శకతను, సామర్థ్యాన్ని పెంచడానికి సాంకేతికతను ఉపయోగించడం ద్వారా జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, పౌర కేంద్రకంగా మార్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ఢిల్లీలోని అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ఎఎ (యూఈఆర్ఎఎ)పై ఉన్న ముండ్కాబక్కర్వాలా టోల్‌ప్లాజా వద్ద 2026 జులైలో మొదటిసారిగా డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇక్కడ విజయ వంతం కావడంతో ఈ సేవలను దేశవ్యాప్తంగా 120 కి పైగా టోల్ ప్లాజాలకు విస్తరించారు. రాబో యే నెలల్లో దేశవ్యాప్తంగా మరిన్ని టోల్‌ప్లాజాల్లో ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది. డిజిటల్ లోకల్ పాస్ విధానానికి లోబడి ఎంపిక చేసిన టోల్ ప్లాజాకు 20 కి.మీ. పరిధిలో నివాసం ఉంటున్నవారు రాజమార్గ యాత్ర మొబైల్ యాప్ ద్వారా లోకల్ పాస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వర్తించే నిబంధనల ప్రకారం, అర్హులైన ప్రయాణికులు ఆ నెలలో సంబంధిత టోల్ ప్లాజా ద్వారా అపరిమిత ప్రయాణం చేయడానికి ఈ పాస్ వీలు కల్పిస్తుంది. గతంలో లోకల్ పాస్ తీసుకోదలచిన ప్రయాణికులు సంబంధిత టోల ప్లాజాను వ్యక్తిగతంగా సందర్శించి, 20 కి.మీ. పరిధిలో తమ నివాస చిరునామాను, ఇతర అర్హతలను ధ్రువీకరించే పత్రాలను సమర్పించాల్సి ఉండేది. సందర్శించి, ఎంపిక చేసిన టోల ప్లాజాల వివరాలను తెలుసుకోవచ్చు.

ప్రయాణికుడి నివాస చిరునామా, వాహన వివరాలు, అనుసంధానించిన ఫాస్టాగ్ తదితర సంబంధిత సమాచారాన్ని పొందడానికి, ధ్రువీకరించుకోవడానికి డిజిలాకర్, వాహన్ సహా ప్రభుత్వ డిజిటల్ వేదికలతో సమ్మతి ఆధారిత అనుసంధానాన్ని డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యం ఉపయోగించుకుంటుంది. ప్రయాణికుని అర్హతను జీఐఎస్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా నిర్ధారిస్తారు. ఇది దరఖాస్తు చేసుకున్నవారు నమోదు చేసిన చిరునామా టోల్‌ప్లాజా నిర్దేశిత 20 కి.మీ. పరిధిలో ఉందో లేదో ధ్రువీకరిస్తుంది.

ధ్రువీకరించిన డిజిటల్ డేటా, జీఐఎస్ ఆధారిత ధ్రువీకరణను ఏకీకృతం చేయడం ద్వారా మాన్యువల్ డాక్యుమెంటేషన్, భౌతిక ధ్రువీకరణ అవసరాన్ని తొలగిస్తుంది.

## ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 9,450 కోట్లు... 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 20:రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వీటి మొత్తం అంచనా వ్యయం దాదాపు ?9,450 కోట్లు. ఆ ప్రాజెక్టులివీ:

ఈ లైన్లలో సామర్థ్యం పెరగడం వల్ల రైళ్ల రాకపోకలు మెరుగుపడతాయి. ఇది భారతీయ రైల్వే రవాణా సామర్థ్యాన్ని, సేవల విశ్వసనీయతను బలోపేతం చేస్తుంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలు రైల్వే కార్యకలాపాలను క్రమబద్ధీకరించి, ట్రాఫిక్ రద్దీని తగ్గించనున్నాయి. ఈ ప్రాంతంలో సమగ్రాభివృద్ధిని సాధించడం ద్వారా... ప్రజలకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించి వారిని ఆత్మనిర్భరులుగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవభారత దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు.సమగ్ర ప్రణాళిక, భాగస్వామ్య పక్షాల మధ్య సంప్రదింపుల ద్వారా.. బహువిధ రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో.. 'పీఎం గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక' ఆధారంగా ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఎలాంటి ఆటంకం లేకుండా.. ప్రజలు, సరుకులు, సేవల రవాణాకు ఈ ప్రాజెక్టులు సదుపాయాన్ని కల్పిస్తాయి.

# పోలీస్ ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి

**-ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కుల్లో సడలింపు ఇవ్వాలని డీజీపీకి వినతి**



నల్గొండ, ఆగష్టు 20:తెలంగాణ పోలీస్ నియామక ప్రక్రియలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు అర్హత మార్కుల్లో సడలింపు ఇచ్చి న్యాయం చేయాలని తెలంగాణ రెడ్డి సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పోలీస్ నియామక ప్రిలిమినరీ అర్హత పరీక్షలో ఇతర రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు మాదిరిగానే ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు కూడా కటాఫ్ మార్కులు తగ్గించాలని సంఘం నాయకులు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.

అనేక మంది పేద ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు స్వల్ప మార్కుల వ్యత్యాసంతో తదుపరి దశకు ఎంపిక కాలేకపోతున్నారని తెలిపారు. కటాఫ్ మార్కుల్లో సడలింపు కల్పిస్తే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

ఈ అంశాన్ని పరిశీలించి ప్రభుత్వం, తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని డీజీపీని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కొట్టం మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలు ఎన్నేపల్లి లింగారెడ్డి, గుజ్జా జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ పాత్ర కీలకం..

ఖమ్మం, ఆగష్టు 12:దేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించిన ప్రదాత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు.

మర్లపాడు గ్రామ ప్రధాన సెంటర్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రి అయిన తరువాత ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా సమాచార విప్లవ పితామహుడిగా దేశంలో నిలిచారని కొరియాడారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవ ఘనత ఆయనకే చెందుతుందన్నారు.

స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారని, ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతి యువకులకు ఎన్నికలలో ఓటు హక్కు కల్పించిన ప్రధాని రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఒగ్గు కరుణాకర రెడ్డి, సర్పంచులు మహ్మద్ ఫక్రుద్దీన్, కనమతరెడ్డి రంగారెడ్డి, పెద్దగొండ్ల ప్రసన్న ధర్మారావు, పొట్లపల్లి శ్రీదేవి భాను ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి అక్బర్, పుచ్చకాయల కాంతారెడ్డి, గడ్డం జగన్మోహన్ రెడ్డి, మేడ వెంకటేశ్వరరావు, మందపాటి వెంకటరెడ్డి, ఒగ్గు సత్యనారాయణ రెడ్డి, రాయల భద్రయ్య, భూక్య నాగులు, రావుల పుల్లారావు, ఈశ్వర చారి, శ్రీకాంత్, గరికపాటి శ్రీనివాసరావు, పుచ్చకాయల సత్యనారాయణ, పామర్తి లక్ష్మి అశోక్, మల్లెల్లి నరసింహస్వామి తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గువహటి - తేజ్‌పూర్ కారిడార్ హైవే అనుసంధానంతో అస్సాం తేయాకు తోటలు, పర్యాటకం, వాణిజ్యానికి ఊతం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 20:అస్సాం చాయ్! ఘుమఘుమలాడుతూ మన బ్రేక్‌ఫాస్ట్ టేబుల్‌ను చేరుకోవడానికి ముందు సుదీర్ఘ ప్రయాణమే చేస్తుంది. తేయాకు తోటలో ఆకులను తుంచి, ఫ్యాక్టరీలో ప్రాసెస్ చేసి, బండెక్కిస్తే ఊర్లు రాష్ట్రాలను దాటుకుంటూ రోడ్డుపై పరుగులు పెడుతూ.. వర్తకులనూ, మార్కెట్లనూ దాటుకుని ఎట్టకేలకు మన ఊరికొస్తుంది. అస్సాం తోట పంట మన ఇంట పరిమళిస్తుంది. ఆస్వాదించడం అనివార్యమనిపించేంతగా జీవితంలో భాగమవుతుంది. అంతేకాకుండా ఆర్థికంగానూ, అనుసంధానంలోనూ అత్యంత కీలకమైన ఈ వ్యవస్థలకు మరింత ఊతమిచ్చేలా కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారి - 15 పరిధిలో 135.87 కి.మీ నాలుగు వరుసల, ప్రవేశ నియంత్రిత గువహటి - తేజ్‌పూర్ కారిడార్ నిర్మాణం కోసం.. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేసిన ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ నెల మొదట్లో ఆమోదించింది.

అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని ఆర్థిక, సామాజిక, వస్తు రవాణా కేంద్రాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ఈ కారిడార్‌కు ప్రణాళిక రూపొందించారు. 15.11 కిలోమీటర్ల మంగళ్‌దోయ్ బైపాస్ మినహా.. గువహటి సమీపంలోని బైహాటా చారియాలి నుంచి తేజ్‌పూర్‌ను కలిపే ఈ ప్రాజెక్టును మొత్తం రూ. 8,970.20 కోట్ల మూలధన వ్యయంతో నిర్మించనున్నారు. బిల్డ్ - ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ టోల్ విధానంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తారు.

ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే వాహనాల సగటు ప్రయాణ వేగం 100 శాతం పెరగడంతోపాటు.. ప్రయాణ సమయం సగానికి తగ్గుతుందని భావిస్తున్నారు. ఇది ఇంధనం పొదుపు చేసేందుకు తోడ్పడడమే కాకుండా, వాహనాల నిర్వహణ ఖర్చులను కూడా తగ్గిస్తుంది. బైహాటా చారియాలి, సిపాఝార్, ఖరూపేటియా, దేకియాజులీ, తేజ్‌పూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మొత్తం 58.7 కి.మీ పొడవైన అయిదు ప్రధాన బైపాస్‌ల నిర్మాణాన్ని కూడా ఈ ప్రాజెక్టులో చేర్చారు. అస్సాంలోని గువహటిని అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటానగర్, పాసీఘాట్‌లతో కలిపే జాతీయ రహదారి వ్యవస్థలో ఇదొక కీలక భాగంగా మారబోతోంది. ఈశాన్య రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది.

అస్సాం తేయాకు పరిశ్రమ ఇప్పటికే అధికారిక మార్కెట్లతో బలంగా అనుసంధానమై ఉంది. టీ బోర్డ్ ఆఫ్ ఇండియా గువహటిలో వేలం ప్రాంగణాన్ని నిర్వహించడంతోపాటు.. ఆ కేంద్రానికి సంబంధించి వేలం గణాంకాలను వారం వారం విడుదల చేస్తుంది. ఈ ప్రాంత తేయాకు వాణిజ్యంలో గువహటి ప్రాధాన్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

సుదీర్ఘమైన ఆ సరఫరా వ్యవస్థలోని పలు కీలక దశల్లో.. కచ్చితమైన హైవే ప్రయాణానికి ఎంతో ప్రాధాన్యముంటుంది. తేయాకు ఉత్పత్తిదారులకూ, రవాణా చేసేవారికీ ఒక మంచి రోడ్డు ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తుంది. వాహనం ఎంత త్వరగా గమ్యస్థానానికి చేరిందన్నదే కాదు.. మరెన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆ ప్రయోజనాన్ని నిర్ణయించాల్సి ఉంటుంది. ఆటంకాలు లేకపోవడం, ప్రయాణం విషయాల్లో మరింత కచ్చితత్వం, వాహన నిర్వహణ ఖర్చులు తగ్గడం, సరుకు రవాణా వేగవంతంగా, సునాయసంగా సాగడం... ఇలాంటి నమ్మకమైన అంశాలను కూడా ఆ విషయంలో పరిగణించాలి.

అలాంటి విస్తృత పాత్రనే గువహటి - తేజ్‌పూర్ కారిడార్ పోషిస్తుందని భావిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాలు, పరిశ్రమలు, వాణిజ్య మార్గాలను అనుసంధానిస్తూ.. ప్రయాణికులు, సరుకుల రవాణాను వేగవంతమూ, సురక్షితమూ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

ఈ ప్రయాణంలో మరో అవకాశం కూడా దాగి ఉంది.. అదే 'టీ టూరిజం'. అస్సాం తేయాకు క్షేత్రాలది ప్రత్యేక ఆకర్షణ. పంటకు మాత్రమే అవి పరిమితం కావు. ఆ తోటలు, ఫ్యాక్టరీలు, వారసత్వం, సంస్కృతి... విస్తృత పర్యాటక అనుభవంలో భాగమవుతాయి.

కొత్తగా నిర్మించే ఈ కారిడార్ ఈ ప్రాంతంలోని ఆర్థిక, సామాజిక కేంద్రాలకు రాకపోకలను మెరుగుపరచడమే కాకుండా.. ఆధ్యాత్మిక క్షేత్రమైన కామాఖ్య మాత ఆలయం, కాజీరంగా జాతీయ పార్కు, ఓరాంగ్ జాతీయ పార్కు వంటి ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు అనుసంధానాన్ని మరింత పెంచుతుంది. ఇది గువహటి, తేజ్‌పూర్, ఉత్తర అస్సాంలోని ఇతర ప్రాంతాలను కలుపుతూ పర్యాటక వలయాన్ని మరింత బలోపేతం చేసేందుకు విస్తృత అవకాశాలను కల్పిస్తుంది.

ఈ కారిడార్ విస్తృతి గణనీయమైనది. నాలుగు వరుసల ప్రవేశ నియంత్రిత రహదారితోపాటు.. 15 ప్రధాన వంతెనలు, 30 చిన్న వంతెనలు, 19 ఫ్లైఓవర్లు, ఒక ఏనుగుల అండర్‌పాస్ (తేజ్‌పూర్ బైపాస్‌లో), 46 సాధారణ అండర్‌పాస్‌లను ఈ ప్రాజెక్టులో నిర్మించనున్నారు. అంతేకాకుండా, ఈ కారిడార్‌ను ప్రవేశ నియంత్రిత రహదారిగా అభివృద్ధి చేస్తూనే.. స్థానిక వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా 210 కిలోమీటర్ల మేర సర్వీస్ రోడ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పీఎం గతిశక్తి పరిధిలోని 8 ఆర్థిక, 2 సామాజిక, 3 పర్యాటక, 7 వస్తు రవాణా కేంద్రాలను అనుసంధానించేలా దీనిని రూపొందించారు. వీటిలో 3 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 జలరవాణా టెర్మినళ్లు ఉన్నాయి.

ఇది రోడ్డు మాత్రమే కాదు: పట్టణాల్లో రద్దీ తగ్గి.. అస్సాం శక్తిమంతమవుతుంది

వేగవంతమైన ప్రయాణమే కాకుండా.. వ్యూహాత్మకంగానూ, నగర రవాణా పరంగానూ ఈ ప్రాజెక్టు ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది. భారత వైమానిక దళంతో సమన్వయంతో తేజ్‌పూర్ బైపాస్‌పై 4.9 కిలోమీటర్ల అత్యవసర ల్యాండింగ్ సదుపాయం ఏర్పాటును ఇందులో ప్రతిపాదించారు. అలాగే బ్రహ్మపుత్రా నదికి దక్షిణ ఒడ్డున ఉన్న ప్రస్తుత జాతీయ రహదారి-27 తూర్పు-పశ్చిమ కారిడార్‌పై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడానికి కూడా ఇది దోహదపడుతుంది. 58.7 కి.మీ పొడవైన అయిదు ప్రధాన బైపాస్‌లు ఈ కారిడార్‌లో ముఖ్యమైనవి. ఇవి బైహాటా చారియాలి, సిపాఝార్, ఖరూపేటియా, దేకియాజులీ, తేజ్‌పూర్ వంటి రద్దీ ఉన్న పట్టణాల నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తాయి. ఇది స్థానికంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే కాకుండా, రహదారి భద్రతను కూడా మెరుగుపరుస్తుంది.

# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి..



మహబూబ్‌నగర్, ఆగష్టు 20: గ్రామపంచాయతీలకు 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం నిధులు, విధులు, అధికారాలను పూర్తిస్థాయిలో బదలాయించాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ బత్తుల వెంకట్ రాములు గౌడ్ డిమాండ్ చేశారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

తెలంగాణ పంచాయతీ చట్టం-2018ను రద్దు చేసి, ఉమ్మడి రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2004 తరహాలో గ్రామ పంచాయతీలకు అధికారాలు కల్పించాలని ఆయన అన్నారు. 73వ రాజ్యాంగ సవరణలోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలకు సంబంధించిన విధులు, నిధులు, అధికారాలను గ్రామపంచాయతీలకు వాస్తవంగా బదలాయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రాజకీయ విభేదాల కారణంగా అభివృద్ధికి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన విధానాన్ని కొనసాగిస్తూ గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీలను సంబంధిత రెవెన్యూ గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహించాలని, తండా గ్రామపంచాయతీలకు భవనాలు, రహదారులు మంజూరు చేయాలని కోరారు. చిన్న గ్రామపంచాయతీలకు రూ.5 లక్షలు, మధ్యస్థ గ్రామపంచాయతీలకు రూ.10 లక్షలు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్ల సాధారణ నిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 15వ ఆర్థిక సంఘం కింద తెలంగాణకు రావాల్సిన రూ.1,090 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని వెంకట్ రాములు గౌడ్ కోరారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.6,500 నుంచి రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ కమిటీల పేరుతో గ్రామసభ నిర్వహణ బాధ్యతలను సర్పంచుల నుంచి దూరం చేసే జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను నేరుగా గ్రామపంచాయతీల ఖాతాల్లోనే జమ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మందుపాల్ వెంకట్, శ్రీశైలం, వివిధ జిల్లాల కన్వీనర్లు పలుస శేఖర్, రాజశేఖర్, వీరోదు సుప్రియ, మురళి, లింగారం శ్రీధర్ గౌడ్, మోదీపూర్ రవి, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ క్లీనర్ మృతి

నల్గొండ, ఆగష్టు 20: సూర్యాపేట?ఖమ్మం జాతీయ రహదారిపై రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల వివరాల ప్రకారం.. సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ లారీ రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద టిఫిన్ చేసేందుకు పక్కకు నిలిపారు. అనంతరం లారీ క్లీనర్ రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మోతె ఎస్సై లచ్చిరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యాభివృద్ధికి బయోస్టెడ్ కంపెనీ తోడ్పాటు..

**-14 మంది విద్యార్థులకు బయోజిమ్ ఉపకార వేతనాలు పంపిణీ**



కామారెడ్డి, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): విద్యాభివృద్ధికి బయోస్టెడ్ కంపెనీ తమ వంతు తోడ్పాటు అందిస్తోందని ఖండేబల్లూర్ గ్రామ సర్పంచ్ చాకలి కృష్ణ కొనియాడారు. గురువారం జుక్కల్ మండలం ఖండేబల్లూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులతో పాటు అనాథ, పేద విద్యార్థులను ఎంపిక చేసి 14 మందికి బయోస్టెడ్ కంపెనీ ఆధ్వర్యంలో బయోజిమ్ ఉపకార వేతనాలను అందించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చాకలి కృష్ణ, విద్యాశాఖ అధికారి తిరుపతయ్య, ప్రాంతీయ మేనేజర్ వరుణ్, వసుంధ పంపిణీదారు గంగాధర్‌తో కలిసి విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనాల ద్వారా వారికి చేయూత అందించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు.

ఈ సందర్భంగా ప్రాంతీయ మేనేజర్ వరుణ్ మాట్లాడుతూ.. కంపెనీ నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాభివృద్ధికి, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు మధ్యలో చదువు మానకుండా ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాలయ్య, ఉపసర్పంచ్ భర్త జ్ఞానేశ్వర్, బయోస్టెడ్ కంపెనీ ప్రాంతీయ నిర్వాహకుడు శ్రీకాంత్, క్షేత్ర సలహాదారులు బానోత్ సర్దార్, బి.ప్రకాష్, జుక్కల్ ఓం సాయిరాం ట్రేడర్స్ యజమాని తుకారాం, విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులను సర్పంచ్ చాకలి కృష్ణ శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

# నాగనూల్ కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**-100 శాతం విద్యార్థినుల హాజరుకు చర్యలు తీసుకోవాలి**

**-విద్య, వసతులపై విద్యార్థినులతో ముచ్చటించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్**

మహబూబ్‌నగర్, ఆగష్టు 20: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్‌తో కలిసి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినుల హాజరు, విద్యాబోధన, పరిశుభ్రత, తాగునీటి వసతి, స్టోర్‌రూమ్, వంటగది, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.

పాఠశాల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 317 మంది విద్యార్థినులు నమోదై ఉండగా, గురువారం 229 మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించారు. గైర్హాజరైన విద్యార్థినుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 100 శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థినులను గుర్తించి కారణాలు తెలుసుకోవాలని, అవసరమైతే తల్లిదండ్రులతో మాట్లాడి వారు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. ఆరోగ్య సమస్యల కారణంగా దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థినులు నిరంతరం పాఠశాలకు హాజరైతేనే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. తరగతి గదులు, విద్యార్థినులు చదువుకునే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థినుల ఆరోగ్యంతో పాటు చదువుపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉన్న సరుకులు, నిత్యావసర వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వస్తువులను సక్రమంగా భద్రపరచడంతో పాటు స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సంబంధిత రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన సందర్భంగా లీకేజీని గుర్తించిన కలెక్టర్.. తాగునీటి విషయంలో విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా దానిని వెంటనే సరిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన చిన్నచిన్న మరమ్మతు పనులను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మౌలిక వసతుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

వంటగదిని పరిశీలించిన కలెక్టర్.. వంటగది పరిశుభ్రత, వంటకు ఉపయోగిస్తున్న సరుకులు, వాటి నిల్వ విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, నిర్ణీత సమయానికి భోజనం పెడుతున్నారా అనే విషయాలను విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని, వంట సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

# విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం..

నిజామాబాద్, ఆగష్టు 20: విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేయడం జరుగుతుందని టీజీవీపీ మండల అధ్యక్షులు భరత్ రాజ్ చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీ కోసం సంతకాల సేకరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు లేకపోవడంతో రెండు సంవత్సరాలుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిప్యూటేషన్ పై పంపిన ఉపాధ్యాయులను వెంటనే వినతి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు.

లేని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.

# నిజామాబాద్‌లో ఘనంగా హర్ష టయోటా గ్రామీణ మహోత్సవం

నిజామాబాద్, ఆగష్టు 20:నిజామాబాద్ ఖలీల్ వాడి : నిజామాబాద్ జిల్లాల్లో హర్ష టయోటా గ్రామీణ మహోత్సవాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గుపన్ పల్లి కమాన్ ఎదురుగాలో గ్రామీణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నగర కార్పొరేటర్ శశాంక్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహోత్సవం ఆగష్టు 20, 21, 22వ తేదీల్లో స్పాట్ బుకింగ్ డిస్కౌంట్ రూ.10వేలు ఇవ్వనున్నామని, హర్ష టయోటా ఆధ్వర్యంలో సరసమైన ధరలకు అందిస్తున్నామని తెలిపారు. కాగా ఈ సందర్భంగా భారీ డిస్కౌంట్లతో కార్లను అమ్మకానికి ఉంచామని, ఈ అవకాశాన్ని నిజామాబాద్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం..

వరంగల్, ఆగష్టు 20: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బానోత్ రామ్‌లాల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవి నాయక్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని కొనియాడారు. సాంకేతిక, టెలికమ్యూనికేషన్స్, విద్య, యువత, గ్రామీణాభివృద్ధి, పరిపాలన, ఎన్నికల వ్యవస్థ, ఆర్థిక రంగాల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆయన విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. దేశాన్ని ఆధునికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, ఐలమల్లు, కౌన్సిలర్లు జాటోత్ సురేష్ నాయక్, మెరుగు రాము, నరసింహారెడ్డి, జరుపుల విజయ నాయక్, అప్సర్, వెర్మారెడ్డి వెంకటరెడ్డి, గుండగాని వెంకన్న, నాయకులు సైదులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

## ఆగస్టు 21... నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న వరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదే క్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు వరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటవే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడుతుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం.



వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొందించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధి పూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్ఠంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్థ వంతంగా నిర్వహించ బడుతున్నది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పాఠశాల స్థాయి నాటక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం




హన్మకొండ, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి) వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా పాఠశాల స్థాయి బాలల నాటిక పోటీలను నిర్వహించనున్నట్టు క్లబ్ ఫౌండర్ నేరెళ్ల శోభావతి, కన్వీనర్ మర్రి రేణుక తెలిపారు. వారు గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను, నటనా కళను వెలికితీసి ప్రోత్సహించి, బాధ్యతాయుతమైన సమాజ హితులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు.

హనుమకొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ (ఆశ్రమ/గురుకుల) పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. నాటికలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా అదే పాఠశాలకు చెందిన వారై ఉండాలి. ప్రతి నాటిక వ్యవధి 30 నుంచి 45 నిమిషాల మధ్య ఉండాలి. ముందుగా పాఠశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులతో నాటికలను సిద్ధం చేయించాలి. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ న్యాయ నిర్ణేతల బృందం పాఠశాలలను నేరుగా సందర్శించి, నాటికల నాణ్యతను పరిశీలించి తుది పోటీలకు ఎంపిక చేస్తుంది.

సమాజంలో చైతన్యం రగిలించే ఆలోచనాత్మక కథాంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. కుల వివక్ష నిర్మూలన, మూఢనమ్మకాలు, నరబలుల వ్యతిరేక ప్రచారం, ఈవ్‌టీజింగ్/ అమ్మాయిలపై జరుగుతున్న వేధింపుల నివారణ, కలుషిత ఆహారం–ఆరోగ్య భద్రత ఇతర సామాజిక సంక్షేమ, చైతన్యవంతమైన అంశాల ఆధారంగా నాటికలు ఉండాలి.

ప్రథమ బహుమతి రూ. 10,000, షీల్డ్, ప్రశంసాపత్రం, ద్వితీయ బహుమతి రూ. 8,000, షీల్డ్, ప్రశంసాపత్రం ఇస్తారు. ప్రదర్శించిన ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికంగా రూ. 5,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, ఉత్తమ నటీనటులు, సాంకేతిక నిపుణులకు ప్రత్యేక జ్ఞాపికలు (ఓవఎవనిబినీబ), ప్రశంసా పత్రాలు అందజేస్తారు.

రిజిస్ట్రేషన్, ఎంట్రీల దాఖలుకు చివరితేదీ ఆగస్టు 30. అక్టోబర్ 15 నుంచి 30 వరకు పరిశీలిస్తారు. పోటీలు నవంబర్ 12, 13, 14 తేదీల్లో హనువకొండలోని నేరేళ్ల వేణు మాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తారు. ఇతర వివరాలకు 8897552958, 889 7552958, 9963338116, 9985549900, 9866253646, 9030972224 నంబర్లకు ఫోన్ చేయాలి. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ సుమతి నాయుడు, సభ్యులు వీ లక్ష్మి కాంతారావు, టీ లక్ష్మణరావు, నాగేశ్వరరావు, కే లలిత, ఎం లావణ్య ఎం రేణుక పాల్గొన్నారు.

# కల్తీ మద్యం తాగి ఏడుగురు మృతి.. 30 మంది ఆసుపత్రిపాలు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 20: మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించారు. మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ( ఈ నేపథ్యంలో 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యపాన నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌లో ఈ సంఘటన జరిగింది. మంగళవారం సాయంత్రం భావనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో మద్యం పార్టీ చేసుకున్న ఐదుగురు స్నేహితులు అస్వస్థతకు గురయ్యారు. పలు గ్రామాల ప్రజలతో పాటు భావ్‌నగర్ నగరంలోని పలు ప్రాంతాల వారు కూడా నకిలీ మద్యం కారణంగా ఆసుపత్రిపాలయ్యారు.

కాగా, మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించగా, మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, జిల్లా అధికారులు అలెర్ట్ అయ్యారు. మరణించిన, చికిత్స పొందుతున్న రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాల్లో విషపూరితమైన మిథనాల్ ఆనవాళ్ళు కనిపించాయి. 'ఇండియన్–మేడ్ ఫారిన్ లిక్కర్' పేరుతో విక్రయించిన కల్తీ మద్యంపై దర్యాప్తు చేశారు.

మరోవైపు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నరేంద్ర సింగ్ యాదవ్ అలియాస్ 'డాక్టర్' పర్యవేక్షణలో కల్తీ మద్యం వ్యాపారి గౌతమ్ సోలంకి ఇంట్లో విషపూరిత మద్యం తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. సరన్, గణేష్, అమన్ అనే వ్యక్తులు మిథనాల్ కలిపిన మద్యం తయారీలో పాల్గొన్నట్లు దర్యాప్తులో బయటపడింది. నరేంద్ర సింగ్ యాదవ్ దానిని సేవించగా మరుసటి రోజు అతడి పరిస్థితి విషమించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో కల్తీ మద్యం తయారీ గుట్టురట్టయ్యింది.

ప్రధాన నిందితుడైన ఉజ్జయిన్‌కు చెందిన రయాన్, జుబేర్, గౌతమ్ సోలంకిలతో కలిసి ముడి పదార్థాలు తీసుకువచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

ఈ ముగ్గురూ అహ్మదాబాద్‌లోని సర్ఖేజ్ నుంచి తెల్లటి ద్రవం, ఖాళీ సీసాలు, సీసా మూతలు, నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు, మిథనాల్ కొనుగోలు చేసి కల్తీ మద్యం తయారు చేశారు. విషపూరిత రసాయనాన్ని అసలైన మద్యంలా కనిపించేలా బాటిల్స్‌పై నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు అతికించారు.

## కాంగ్రెస్ నేత సజ్జన్ కుమార్ కన్నుమూత

న్యూఢిల్లీ, ఆగష్టు 20: కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూశారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో ఆయన జీవితకాల శిక్షను అనుభవిస్తున్నారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో ఆయన ప్రాణం విడిచారు. తీహార్ జైలు నుంచి ఆయన్ను చివరి క్షణాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 80 ఏళ్లు. చాన్నాళ్లుగా పలు రకాల రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చింది. ఆ తర్వాత ఆయనకు ఆ కేసులో జీవితకాల శిక్షను విధించింది. సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలని కోరుతూ సిక్కు అల్లర్ల బాధితులు డిమాండ్ చేశారు.

మూడు సార్లు ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నేతగా గుర్తింపు ఉన్నది. 2018లో దోషిగా తేలడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత ఢిల్లీలో అల్లర్లు చోటు చేసుకున్నాయి. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరా గాంధీ బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ ఆమె హత్యకు పాల్పడ్డారు. అయితే ఆ హత్య నేపథ్యంలో సిక్కులపై ఢిల్లీలో ఊచకోత జరిగింది. సిక్కుల ఇండ్లు, షాపులపై దాడి చేశారు. సుమారు 3వేల మంది సిక్కులను హతమార్చారు. జశ్వంత్ సింగ్‌తో పాటు ఆయన కుమారుడి హత్య కేసులో సజ్జన్ కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత ఇద్దరు సిక్కులను హతమార్చిన కేసులో మరో వ్యక్తి యశ్‌పాల్ మాలిక్‌కు మరణశిక్ష వేశారు.

# రాజీవ్‌గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

## – డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఆగస్టు 20(నేటి నిజం ప్రతినిధి) మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు.

దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు ఆయన తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్‌గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలు, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు.



సంగారెడ్డి ఆగస్టు 20(నేటి నిజం ప్రతినిధి) నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.


ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు దీపక్ రాథోడ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, పీసీసీ పరిశీలకులు రియాజ్, దుద్దిళ్ల శ్రీనుబాబు, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కార్యక్రమం ప్రారంభంలో నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేయడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయన చేసిన కృషిని నాయకులు కొనియాడారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు..

# టీటీడీకి హైదరాబాద్‌కు చెందిన వైద్య దంపతుల విరాళం



తిరుపతి, ఆగష్టు 20: భక్తగ్రేసరుడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో స్వామివారి పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. నిన్న స్వామివారిని 76,464 మంది భక్తులు దర్శించుకోగా 36,913 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

స్వామివారి దర్శనం కోసం కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.94 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వివరించారు. సుమారు 4.27 లక్షల లడ్డూలను విక్రయించామని, 2.63 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదం అందించామని వివరించారు.

**టీటీడీకి హైదరాబాద్‌కు చెందిన వైద్య దంపతుల విరాళం**

స్థానిక నగర గైడ్‌లను పరిశీలించడంహైదరాబాద్ కు చెందిన డాక్టర్ పి.శిల్పా, డాక్టర్ శ్రీధర్ రెడ్డి దంపతులు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు బుధవారం రూ.15 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

# శ్రావణ శోభ - వరప్రదాయిని “శ్రీ మహాలక్ష్మి”



## శ్రావణ మాస ప్రస్తావన :

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ప్రతి మాసానికీ ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి పండుగ వెనుక సందేశం ఒక నియమం, మనిషిని సన్మార్గంలో నడిపించే ఒక ఆధ్యాత్మిక భావన దాగి ఉంది. హిందువులకు అత్యంత పవిత్ర మాసం, శ్రావణ మాసం. శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా ఈ మాసంలోనే అన్నది పురాణ ప్రతీతి. శ్రావణ మాసం ప్రారంభం ఆగస్టు 13 వ తేది నుండి సెప్టెంబర్ 11 వ తేది శుక్రవారం వరకు కొనసాగుతుంది. ఈ నెల రోజులు శ్రీ మహావిష్ణువుకు, శ్రీ మహాలక్ష్మికి పూజలు, వ్రతాలు జరుపుకుంటారు. శ్రావణం అత్యంత శుభకరం గా వివాహాలు, గృహప్రవేశాలు, నూతన ఆరంభాలకు అనుకూలం. శ్రావణం అంటే మహిళలకు ప్రత్యేకం. మహిళలు శ్రీ మహాలక్ష్మి దేవికి పూజలు, ఆరాధనలు చేస్తూ, సేవించుకునే పుణ్యకాలం శ్రావణ మాసం. ఈ మాసంలో శ్రీ మహాలక్ష్మిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే, ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతానం, సౌభాగ్యం, సకల శుభాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి ఆగస్టు, 21 (రెండవ శుక్రవారం) “వరలక్ష్మి వ్రతం జరుపుకుంటారు. ఆచరించవలసిన విధులు సాత్విక జీవనం పాటించడం వలన శ్రీమహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందని పురాణాల ప్రతీతి. మహిళలు ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో లేచి స్నానం చేసి శ్రీ మహాలక్ష్మిని పూజించి, ప్రార్థించాలి. ఇంట్లో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయాలి. తులసి మొక్కకు నీరు పోసి, దీపం వెలిగించి ప్రదక్షిణలు చేయాలి. “ఓం నమో నారాయణాయ నమః”, “శ్రీం మహాలక్ష్మ్యై నమః” వంటి మంత్రాలను జపించాలి. విష్ణు సహస్రనామం, మహాలక్ష్మీ అష్టకం పారాయణం చేయడం శుభప్రదం.

## శ్రీ మహాలక్ష్మీ పూజా విశిష్టత :

శ్రావణం వచ్చిందంటే చాలు, ఇంటి వాకిళ్లలో అందమైన ముగ్గులు కనిపిస్తాయి. గుమ్మాలకు పచ్చని మామిడి ఆకుల తోరణాలు అలంకరిస్తాయి. పూజా మందిరాల్లో దీపాలు వెలుగుతాయి. పసుపు, కుంకుమలతో లక్ష్మీదేవి పాదాలను భక్తితో పూజిస్తారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలను ధరించి, కుటుంబ శ్రేయస్సును కోరుకుంటూ శ్రీ మహాలక్ష్మీదేవిని సేవిస్తారు. శ్రావణమాసం నియమానికి, కుటుంబ అనుబంధానికి, మంగళకరమైన ఆలోచనలకు, దైవారాధనకు, దానధర్మాలకు, కుటుంబ సంక్షేమాన్ని కోరుకునే ప్రార్థనలకు భక్తికి ప్రతీక. పురాణ విశ్వాసాల ప్రకారం శ్రీ మహాలక్ష్మీదేవి అంటే, కేవలం ధనాన్ని ప్రసాదించే దేవత మాత్రమే కాదు. సంపద, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందం, సద్గుణం, సంతానం, విద్య, విజయం, ధైర్యం, కుటుంబ శాంతి, శుభ్రత, సత్యం, దయ, పెద్దలకు గౌరవం, స్త్రీలకు ఆదరణ, శ్రమకు విలువ ఇచ్చే చోట... శ్రీ మహా లక్ష్మీదేవి నివాసం ఉంటుందంటారు. ప్రవర్తనలో పవిత్రత, మాటల్లో మాధుర్యం, చేతల్లో దాన గుణం, మనసులో దయగుణం, ఇంట్లో ఐకమత్యం ఉండాలి. ఇవన్నీ కలిసినప్పుడే, మహాలక్ష్మి ఆరాధనకు నిజమైన పరిపూర్ణత లభిస్తుంది. శ్రావణ శుక్రవారం ఆ రోజు ఉదయాన్నే నిద్రలేచి ఇంటిని శుభ్రపరచి వాకిట్లో ముగ్గులు వేసి, పూజా మందిరాన్ని పూలతో అలంకరించి దీపం వెలిగించి శ్రీ మహాలక్ష్మీదేవిని ఆరాధించడం సంప్రదాయం. మహిళలు పసుపు, కుంకుమలతో అమ్మవారిని పూజిస్తూ, భర్త ఆయురారోగ్యాల కోసం, పిల్లల విద్య, ఉద్యోగం, భవిష్యత్తు కోసం, కుటుంబంలో సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేస్తుంటారు.

## “వరప్రదాయిని” వరలక్ష్మీ వ్రతం

శ్రావణ మాసంలో నిర్వహించే వ్రతాలలో ప్రధానమైనది. వరలక్ష్మీ వ్రతం. ‘వరలక్ష్మి’ అనే పదంలోనే వరాలను ప్రసాదించే తల్లి అనే భావం ఉంది. భక్తితో ప్రార్థించిన వారికి కొంగు బంగారమై, ధర్మబద్ధమైన కోరికలను నెరవేర్చే వరప్రదాయినిగా శ్రీ మహాలక్ష్మీదేవిని ఆరాదిస్తారు. శ్రీ వరలక్ష్మి వ్రతం పూజకు కావలసిన ముఖ్యమైన సామగ్రి పసుపు,కుంకుమ, చందనం, అక్షతలు, పూలు, కలశం, కలశానికి కావలసిన నీరు, మామిడి ఆకులు, కొబ్బరికాయ, ఎరుపు లేదా గులాబీ రంగు వస్త్రం...(ఆనవాయితీ ననుసరించి) దీపం, వత్తులు, నెయ్యి లేదా నూనె, అగరుబత్తులు, కర్పూరం, పంచామృతం, పండ్లు, కొబ్బరికాయ, తమలపాకులు, వక్కలు, దక్షిణ, తాంబూలం ఇవన్నీ మనకు అందుబాటులో ఉన్నంత వరకు సిద్ధం చేసుకోవచ్చు. వరలక్ష్మీ వ్రతాన్ని ఆయా కుటుంబ ఆచారాలు ఆనవాయితీ అనుసరించి నిర్వహిస్తారు. వరలక్ష్మీ వ్రతం రోజు ఇంటి ముంగిట అందమైన ముగ్గులు, గుమ్మానికి పసుపు కుంకుమ బొట్టు, మామిడి ఆకుల తోరణాలతో అలంకారం చేసుకుని, శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు ఇంటికి వస్తున్నారనే పవిత్ర భావంతో... పాదముద్రలను ఇంటి గుమ్మం నుంచి పూజా మందిరం వరకు వేస్తారు. పూజా మందిరం ముందు ముగ్గు వేసి, ఆ ప్రదేశంలో పీట ఏర్పాటు చేయాలి. ఆ పీటపై ఎర్రని వస్త్రాన్ని పరచి దానిపై కలశాన్ని ప్రతిష్ఠించాలి. కలశంలో శుభ్రమైన నీరు పోసి, పసుపు, కుంకుమ, అక్షతలు, పుష్పం, నాణెం వీలైనంత వరకు సుగంధ ద్రవ్యాలను ఉంచవచ్చు. కలశంపై మామిడి ఆకులను అమర్చివాటి మధ్య కొబ్బరికాయను ఉంచాలి. కొబ్బరికాయకు పసుపు, కుంకుమ పెట్టి జాకెట్టు వస్త్రంతో అలంకరించాలి. నైవేద్యం బెల్లం, పాయసం లేదా పరమాన్నం... ఆయా వారి శక్తి కొలది చక్కెర పొంగలి, బెల్లం, నెయ్యితో చేసిన ప్రసాదం, కొబ్బరి లడ్డూలు, పాలు, అరటిపండ్లు, ఇతర పండ్లు కుటుంబ ఆచారానికి అనుగుణంగా సమర్పించవచ్చు. అయితే...పూజలో ఖరీదైన సామగ్రి కంటే, భక్తితో నిండిన హృదయమే ముఖ్యమైనది. ఏ శుభకార్యాన్నైనా. ఏ వ్రతాన్నైనా ముందుగా విఘ్నాలను తొలగించే శ్రీ గణపతిని ప్రార్థించి ప్రారంభించడం సంప్రదాయం. కాబట్టి శ్రీ మహాగణాధిపతయే నమః” అని ప్రార్థించి పూజలో ఎటువంటి విఘ్నాలు కలగకుండా అనుగ్రహించాలని వినాయకుడిని వేడుకోవాలి. ఆ తరువాత మనసును ప్రశాంతంగా ఉంచుకుని శ్రీ మహాలక్ష్మీదేవిని పాదాలను కుంకుమ పూజతో అష్టోత్తరశతనామావళి పఠిస్తూ, ఆరాధించి, ధ్యానించాలి. పద్మాసనంపై ఆసీనురాలై కరుణతో చిరునవ్వులు చిందించే లక్ష్మీ అమ్మవారి రూపాన్ని మనసులో నిలుపుకొని అమ్మవారికి నైవేద్యాన్ని నివేదించి, పూజ ముగిసిన తదుపరి శ్రీ మహాలక్ష్మీ కి కర్పూర హారతి ఇవ్వాలి. హారతి సమయంలో మంగళకరమైన (నారాయణి స్తుతి) ఈ శ్లోకాన్ని పఠిస్తారు. సమస్త శుభాలను, కోరిన కోర్కెలను ప్రసాదించమని అమ్మవారిని వేడుకుంటూ, కుటుంబ సభ్యులందరూ కలిసి అమ్మవారిని ప్రార్థిస్తే ఇంట్లో ఒక పవిత్రమైన, ఆనందకరమైన వాతావరణం ఏర్పడుతుంది. తదుపరి అమ్మవారికి నైవేద్యాన్ని నివేదించి, ప్రసాదంగా కుటుంబ సభ్యులకు పంచాలి. ప్రసాదాన్ని వరప్రదాయిని వరలక్ష్మి అమ్మవారి అనుగ్రహంగా స్వీకరించాలి. పూజ పూర్తయిన తరువాత సుమంగళి మహిళలకు పసుపు కుంకుమ తాంబూలం పండ్లు, వీలైనంత వరకు దక్షిణ రవిక వస్త్రం లేదా ఉపయోగకరమైన వస్తువులను అందించడం శుభప్రదంగా భావిస్తారు. అయితే దానం చేసేటప్పుడు ఆడంబరం, సామర్థ్యానికి మించి ఖర్చు చేయాల్సిన అవసరంలేదు. ప్రేమతో, గౌరవంతో, మనస్ఫూర్తిగా అందించిన చిన్న తాంబూలం కూడా విలువైనదే. పూజ చేసేటప్పుడు కోరికలను మాత్రమే అమ్మవారికి చెప్పడం కాకుండా, లభించిన వాటికి కృతజ్ఞత తెలియజేయడం కూడా ఎంతో ముఖ్యం. పూజ చేసే విధానంలో చిన్నచిన్న తేడాలు ఉన్నప్పటికీ, అందరి ప్రార్థనలో ఉండే ప్రధాన భావం ఒక్కటే. వరప్రదాయిని శ్రీ మహాలక్ష్మీ “అమ్మా మా కుటుంబాన్ని, సర్వ జనులను చల్లగా చూడమ్మా. ధర్మమార్గంలో సంపాదించే శక్తిని ఇవ్వు. సంపాదించిన దానిని సద్వినియోగం చేసే జ్ఞానాన్ని ఇవ్వు. కుటుంబంలో ప్రేమను, ఐకమత్యాన్ని నిలబెట్టు. ఇదే వరలక్ష్మీ వ్రతం వెనుక ఉన్న అంతరార్థం. సంప్రదాయాలను కేవలం ఆచారాలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న సామాజిక, ఆధ్యాత్మిక, నైతిక విలువలను కూడా తెలుసుకుని పాటించడం అత్యంత శ్రేయస్కరంగా భావించాలి.

## ఆధునిక మహిళ

ఈ ఆధునిక కాలంలో నేటి మహిళలు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, సమయం లేకపోవడం, ఆరోగ్య సమస్యలు, వంటి కారణాల వల్ల శ్రీ మహాలక్ష్మీకి పూజలు, సేవలు విస్తృతంగా చేయడం అందరికీ సాధ్యపడకపోవచ్చు. అందుకు వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదు. మీ సమయానుకూలతను బట్టి స్నానం చేసి, శుభ్రమైన వస్త్రాలు ధరించి, దీపం వెలిగించి శ్రీ మహాలక్ష్మీదేవి చిత్రపటానికి పసుపు, కుంకుమ పెట్టి ఒక పువ్వు సమర్పించి లక్ష్మీ అష్టోత్తరం పారాయణం పఠిస్తూ, ఒక పండు నైవేద్యంగా పెట్టి మనస్ఫూర్తిగా ప్రార్థించినాచాలు. పూజలో పరిమాణం కంటే పవిత్రత, ఆడంబరం కంటే ఆత్మీయత కలిగిన భక్తి ప్రధానం.

శ్రావణ మాసం అందించే ముఖ్యమైన సందేశం ఇంటిని, మనసుని పరిశుభ్రంగా ఉంచుకుందాం. ప్రతినిత్యం పూజా మందిరంలో దీపాన్ని వెలిగించి, మానవజీవితంలో మసిబారిన అజ్ఞానాన్ని తొలిగిద్దాం. శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పూలను సమర్పిద్దాం. చుట్టూ ఉన్నవారికి ప్రేమను పంచుదాం. శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పిద్దాం. ఆకలితో ఉన్నవారికి శక్తి కొలది దానం చేద్దాం. నీ భక్తులకు అన్నపానాదులకు లోటు లేని సంపదను ప్రసాదించమని, ధర్మబద్ధంగా సంపాదించినది సమాజహితానికి ఉపయోగించే బుద్ధి, జ్ఞానాన్ని ఇవ్వమని శ్రీ మహాలక్ష్మీదేవిని వేడుకుందాం. ఇదే నిజమైన శ్రీ మహాలక్ష్మీదేవికి పూజ. ఇదే శ్రావణమాసం శ్రీ మహాలక్ష్మీదేవి ఆరాధనలోని పరమార్థం.

సర్వే జనా! సుఖినో భవంతు!



–శారద శృంగేరి
9490 26 1119

# పోషకాహార లోపం ముప్పు ఉన్న భారతీయ పిల్లల్లో ఎదుగుదల

ABBOTT

హైదరాబాద్, ఆగష్టు 20:పోషకాహార లోపం ముప్పు ఉన్న పిల్లలకు నోటి ద్వారా ఇచ్చే పోషకాహార సప్లిమెంట్ అందించగా, కేవలం ఆహార సలహాలు పొందిన పిల్లలతో పోలిస్తే వారి ఎత్తు పెరుగుదల సుమారు 2.4 రెట్లు ఎక్కువగా, అలాగే లీన్ మాస్ (శరీరంలోని కొవ్వు కాని భాగాలు) పెరుగుదల దాదాపు 15% ఎక్కువగా కనిపించింది.

ఈ పరిశోధన ఫలితాలు కేవలం ఎత్తు, బరువు మాత్రమే కాకుండా లీన్ మాస్ ఎముకల ఆరోగ్యంలో కూడా మెరుగుదల ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదల నాణ్యతను సూచిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రముఖ సంస్థ అయిన అబాట్ , పోషకాహార లోపం ముప్పు ఉన్న భారతీయ పిల్లలకు ఆహార సలహాలతో పాటు నోటి ద్వారా తీసుకునే పోషకాహార సప్లిమెంట్ అందించినప్పుడు, వారి ఎదుగుదలలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని తెలిపే ఒక రాండమైజ్డ్ కంట్రోల్డ్ ట్రయల్ ఫలితాలను ప్రకటించింది. సప్లిమెంట్ పొందిన పిల్లల్లో, కేవలం ఆహార సలహాలు పొందిన పిల్లలతో పోలిస్తే ఆరు నెలల్లో ఎత్తు పెరుగుదల సుమారు 2.4 రెట్లు ఎక్కువగా, లీన్ మాస్ పెరుగుదల దాదాపు 15% ఎక్కువగా నమోదైంది.

ఈ అధ్యయనం చిల్డ్రన్ జర్నల్ అఫ్ క్లినికల్ మెడిసిన్ జర్నల్స్‌లో ప్రచురించబడింది. ఇందులో సుమారు 3 నుంచి 7 సంవత్సరాల వయస్సు కలిగిన, ఆహారం విషయంలో ఎంచుకుని తినే అలవాటు ఉన్న, పోషకాహార లోపంతో ఉన్న లేదా పోషకాహార లోపం ముప్పులో ఉన్న 223 మంది భారతీయ పిల్లలు పాల్గొన్నారు.

ఆరు నెలల పాటు అధ్యయనంలో పాల్గొన్న పిల్లలు వారి కుటుంబాలకు ఆహారంపై సలహాలు అందించారు. వారిలో సుమారు సగం మంది పిల్లలకు అదనంగా రోజుకు రెండు సార్లు పీడియా ష్యూర్ అబాట్ పిల్లల కోసం తయారు చేసిన నోటి ద్వారా తీసుకునే పోషకాహార సప్లిమెంట్ ఇచ్చారు. పరిశోధకులు నిర్ణయించిన వ్యవధుల్లో పిల్లల ఎదుగుదల, ఆహారం తీసుకునే పరిమాణం, శరీర నిర్మాణం ఇతర ఆరోగ్య సూచికలను పరిశీలించారు.

శరీర నిర్మాణం ఎముకల ఆరోగ్యాన్ని డ్యూయల్-ఎనర్జీ ఎక్స్-రే అబ్సార్ప్షియోమెట్రీ ద్వారా అంచనా వేశారు. ఇది లీన్ మాస్, కొవ్వు పరిమాణం ఎముకల ఖనిజీకరణను ఖచ్చితంగా కొలవడానికి ఉపయోగించే ప్రామాణిక ఇమేజింగ్ విధానం. లీన్ మాస్ అంటే శరీర కొవ్వును మినహాయించి కండరాలు, ఎముకలు, అవయవాలు శరీరంలోని ఇతర భాగాలు.

ముఖ్యమైన ఫలితాలు:

శారీరక ఎదుగుదల నాణ్యత ఎముకల ఆరోగ్య సూచికల్లో మెరుగుదల:

సప్లిమెంట్ పొందిన పిల్లల్లో ఎత్తు, బరువు లీన్ మాస్ పెరిగాయి. అదే సమయంలో, వయస్సుకు అనుగుణమైన బి ఎం ఐ డిఎక్స్ ఏ కొలతల ప్రకారం అధిక కొవ్వు పేరుకుపోవడం కనిపించలేదు. డిఎక్స్ ఏ పరీక్ష ద్వారా ఎముకల ఖనిజ సాంద్రతలో 35% పెరుగుదల, అలాగే ఎముకల ఖనిజ పరిమాణంలో మెరుగుదల నిర్ధారించబడింది.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్, 20: (నేటినిజం ప్రతినిధి), రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన “ఫీజుల బకాయి ? బీజేపీ లడాయి” కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులురామచంద్రరావు తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ × పాల్గొన్నారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ.12 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోవైపు కాలేజీ యాజమాన్యాలకు ఫీజు బకాయిలు అందకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడి, కొన్ని విద్యాసంస్థలు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు.గల్లీ నుంచి అసెంబ్లీ వరకు విద్యార్థుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను పూర్తిగా విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థులకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వం మెడలు వంచేలా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని అన్నారు.విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్ , జిల్లా ఇన్‌చార్జ్ శాంత కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు తో పాటు కార్పొరేటర్లు, విద్యార్థులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఉచిత కంటి ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20::(నేటినిజం ప్రతినిధి): కంటి ఆరోగ్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురు వారం నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చక్రవర్తి ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విద్యార్థులు, కళాశాల సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వంశీకృష్ణ, కొమ్మ నటరాజ్,డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో పలువురు విద్యార్థులు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలను గుర్తించారు. అవసరమైన వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు. కంటి చూపు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సమస్యలు ఎదురైనప్పుడు పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. లైన్స్ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బచ్చు వంశీ సూచించారు.సామాజిక సేవలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు అందించడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం కలిగిందన్నారు. వైద్య పరీక్షలతో పాటు అవసరమైన సలహాలు, సూచనలు అందడంతో శిబిరంలో పాల్గొన్న వారు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు మోటూరి శ్రీనివాస్, చీకోటి సంతోష్, శంకరయ్య, రవీందర్, విష్ణు, శరణ్య, అస్మా, భూమ్రా, సుధాకర్, తాటికొండ శ్యామ్, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భార్య, చెల్లెలిని చంపిన ఎస్‌బీఐ ఉద్యోగి.. ఆపై తానూ ఆత్మహత్య

లక్నో, ఆగష్టు 20: మానస్ వాజ్‌పేయి అనే ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఉద్యోగి గురువారం మధ్యాహ్నం లక్నోలోని ప్రముఖ ప్రాంతమైన గోమతి నగర్‌లో ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ బయట తన భార్యను కాల్చి చంపాడు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం అందించారు. వారికి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 38 ఏండ్ల మానస్ వాజ్‌పేయి బ్యాంక్‌లో పనిచేస్తున్న తన భార్య దివ్య మిశ్రాను బయటకు పిలిచాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడ ఉన్నవారు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు.

మానస్, దివ్యలకు 12 ఏండ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలంగా వారు విడిగా ఉంటున్నారు. దివ్య గతేడాది విడాకుల కోసం దరఖాస్తు చేసుకుందని సమాచారం.

మానస్.. మానసిక సమస్యలతో బాధపడుతున్న తన 28 ఏండ్ల చెల్లెలు శివ వాజ్‌పేయి ని కూడా కాల్చి చంపాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకునేముందు తన భార్యను, చెల్లెలిని చంపిన విషయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. ఈ రోజు నన్ను మోసం చేసిన నా భార్యను చంపేశాను. నా చెల్లెల్లిని చంపి, నేను చనిపోతున్నాను. ఆమె చెల్లెలు ప్రజ్ఞ, అన్నీ అంతం కావాలి అని వాట్సప్ స్టేటస్‌లో రాశాడు.

మానస్ 12:30కు ఇంటికి వచ్చాడని, ఆందోళన, చెమటలు పట్టిన ముఖంతో కనిపించాడని పొరిగింటివారు చెప్పారు. ఇంటిలోకి వెళ్లిన అతడు హనుమాన్ చాలీసాను ప్లే చేశాడు. తరువాత అతడి వాట్సాప్ స్టేటస్ చూసి లోనికి వెళ్లి చూడగా మానస్ విగతజీవిగా కనిపించాడని వారు చెప్పారు. ఈ ఘటన గురించి దివ్య సోదరి ప్రజ్ఞ మిశ్రా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. నా సోదరిపై కాల్పులు జరిగాయని నాకు ఇప్పుడే ఫోన్ వచ్చింది. ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు. దయచేసి ప్రార్థించండి అని ఆమె యూపీ పోలీసులకు ట్యాగ్ చేశారు. మానస్ తన వాట్సప్ స్టేటస్‌లో ప్రస్తావించిన ప్రజ్ఞ ఈమె అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

# శ్రీహరి రాజకీయ ప్రస్థానానికి 25 ఏళ్లు..



మహబూబ్‌నగర్, ఆగష్టు 20:రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏ. సంజీవ్ ముదిరాజ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలకు హాజరైన రాష్ట్ర మంత్రి సీతక్కకు డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్య క్రమంలో సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. వాకిటి శ్రీహరి 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజాసేవకు, నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్న శ్రీహరికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి, కార్పొరేటర్ ఎంపీ ప్రవీణ్‌కుమార్, అబ్రార్, రాజు, రాకేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ఎమ్మెల్యే గల్లా మాధవి గళం



గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవికి వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆమె చేసిన ఈ ప్రయత్నాన్ని సంఘాల నాయకులు అభినందించారు.

అమరావతి, ఆగష్టు 20: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో గళమెత్తారు. ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల చిరకాల డిమాండ్ అయిన ఇళ్ల స్థలాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, జర్నలిస్టుల తరఫున

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.